ప్రజలే ప్రభువులు


# జనబలం

సెప్టెంబర్ 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## బీసీలకు 42% రిజర్వేషన్లు : స్థానిక ప్రభుత్వాల సాధికారత

## ఓటరు జాబితా ప్రక్షాళన : ఎన్నికల సంస్కరణలు



## ట్రంప్ సుంకాల దుమారం

## స్కూలు పుస్తకాల్లోకి RTS



# అధిక వర్షాలు వరం - నగరాలే నరకం

ఈ ఏడాది కూడా భారీ వర్షాలు పలు నగరాల్ని, పంట పొలాల్ని వరదలతో ముంచెత్తాయి. ఇందుకు వాతావరణాన్ని, పర్యావరణ మార్పులను నిందించి ప్రయోజనం లేదు. ప్రకృతితో సమన్వయం ద్వారా ఉత్పాతాల నుంచి కాపాడుకోవటంపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంది.

వచ్చే మూడు దశాబ్దాల్లో దాదాపు **50** కోట్ల మందికి పైగా మన నగరాలు, పట్టణాల్లో ఉండబోతున్నారు. పట్టణీకరణ అనివార్యం, అవసరం. మన నగరాలు, పట్టణాలు ఇప్పటికీ ప్రతి వానాకాలంలో వరదలతో అస్తవ్యస్తంగా మారుతుంటే.. రాబోయే కాలంలో పట్టణాల్లో జనాభా రెట్టింపైతే ఆ విధ్వంసం, వైపరీత్యాలను ఊహించగలమా?

కాబట్టి, అన్ని పట్టణ ప్రాంతాల్లో సహజ నీటి ప్రవాహాలు, వరద నీటి కాలువలకు ఉన్న అవరోధాలను తొలగించాలి. వరద నీరు నిర్మాణ అనుమతుల్ని పట్టించుకోదు. పల్లానికే పారుతుంది. నగరాలు, పట్టణాల్లోని ప్రతి ప్రాంతానికీ కాంటూర్ పటాల్ని రూపొందించి వాలును బట్టి రోడ్లు నిర్మించాలి.

తక్కువ నైపుణ్యాలున్నవారు కూడా మహానగరాలకు వలస రావాల్సిన అవసరం లేకుండా గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ప్రణాళికాబద్ధ ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి.

అనావృష్టి అయితే మనకు కష్టమయ్యేది. సరైన ప్రణాళికలు, సమర్థ అమలు ఉంటే – మనలాగా నీటికొరత గల, రుతుపవన ఆధారిత దేశంలో అధిక వర్షపాతం వరమే అవుతుంది. ఒకపక్క పర్యావరణ పరిరక్షణ చేస్తూనే, మరోవంక ప్రకృతికి అనుగుణంగా మారే మానవ సహజ సామర్థ్యాన్ని ఒక దేశంగా మనం ప్రదర్శించాలి.

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ప్రజలే ప్రభువులు

సెప్టెంబర్ 2025

సంపుటి 27 సంచిక 09


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


06 ఆంక్షలు, సుంకాలపై ఆచరణాత్మకత తప్ప.. గొప్పలొద్దు, మోకరిల్లనక్కర్లేదు

08 బీసీలకు 42% రిజర్వేషన్లు - స్థానిక ప్రభుత్వాల సాధికారత

11 ఈసీ నిర్ణయం..వివాదాస్పదం లోక్‌సత్తా పరిష్కారమే మార్గం

18 నిమిష ప్రియ కేసు భారత్‌కి ఓ పాఠం

22 జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా .. పార్టీల విప్ జారీ


### కార్టూన్ కార్నర్




ఆగండ్రార్! మాకు మద్దతిచ్చినందుకు థాంక్స్ చెప్పడానికొస్తున్నాం.. అంతే! భౌ..భౌ..!!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# షాంఘై స్ఫూర్తి ...పాతికేళ్ల ప్రస్థానం!

సంపాదకీయం

రెండో ప్రపంచ యుద్ధం ముగిసి ఎనబై ఏళ్ళు అయింది. అప్పట్లో ఆవిర్భవించిన అంతర్జాతీయ వ్యవస్థలు ఇన్నేళ్ళుగా ప్రపంచాన్ని నడిపిస్తూ వచ్చాయి. యుద్ధాలను, అణు ఆయుధాలను సమూలంగా అంతం చేయాలన్న అలనాటి సంకల్పం నెరవేరలేదు. జాతులమధ్య సమానత్వం, సామరస్యం, శాంతియుత సహజీవనం పాదుకొల్పాలన్న స్వప్నం సాకారం కాలేదు. సకల వివక్షలకు చరమగీతం పాడాలన్న సదాశయం సుదూరంలోనే నిలిచిపోయింది.

యుద్ధానంతరం ఆవిర్భవించిన రెండు ధ్రువాల ప్రపంచం సమకాలీన సమస్యలకు పరిష్కారాలను చూపలేక పోయింది. కాలం చెల్లిన ఆధిపత్య భావజాలాలు ఉద్రిక్తతలను పెంచాయే తప్ప శాంతి సామరస్యాలను నెలకొల్పలేక పోయాయి. గత మూడు దశాబ్దాలుగా అమెరికా, నాటో, యూరోపియన్ యూనియన్ అంతర్జాతీయ వ్యవహారాల్లో తమ గత ప్రాభవాన్ని, ప్రభావాన్ని క్రమేపీ కోల్పోతున్నాయి.

దాంతో గత కొన్ని దశాబ్దాలుగా బహుళపక్ష, బహుళ ధ్రువాల, ప్రాంతీయ సహకార వ్యవస్థలు ఆవిర్భవిస్తున్నాయి. జి 20, బ్రిక్స్, ఆఫ్రికన్ యూనియన్, ఆసియాన్, సార్క్ , కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్, వంటి పలు సంస్థలు, వేదికలు , వ్యవస్థలు మెల్లిగా నిలదొక్కుకుంటున్నాయి. ఏకపక్ష, ఆధిపత్య విధానాలకు విరుగుడుగా దక్షిణాది దేశాలు ఏకం అవుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, పేద దేశాలు తమ ప్రయోజనాలకోసం గొంతు విప్పుతున్నాయి.

అలాంటి కోవకు చెందినదే షాంఘై సహకార సంస్థ. 1996 లో ఐదు మధ్య ఆసియా దేశాలతో "షాంఘై- 5" గా ప్రారంభమైన ఈ వేదిక 2000 వ సంవత్సరంలో షాంఘై సహకార సంస్థగా (ఎస్.సి.ఓ) రూపాంతరం చెందింది. "నూతన ప్రజాస్వామ్య, న్యాయబద్ధ, సహేతుక అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక ప్రపంచాన్ని నిర్మించడం" తన లక్ష్యంగా సంస్థ ప్రకటించింది.

బెలారస్, భారత్, ఇరాన్, కజకిస్థాన్, చైనా, కిర్గిజ్ స్తాన్, పాకిస్తాన్, రష్యా, తజిక్ స్తాన్ , ఉజ్బెకిస్తాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. లావోస్‌కు కూడా సభ్యత్వం ఇవ్వాలని తాజాగా నిర్ణయించడంతో సభ్య దేశాల సంఖ్య పదకొండుకు పెరిగింది. సంస్థలో ఆఫ్ఘనిస్తాన్, మంగోలియా దేశాలు పరిశీలక హోదాను కలిగి ఉన్నాయి. మరో పద్నాలుగు దేశాలు సంభాషణా భాగస్వామ్య హోదా కలిగి ఉన్నాయి.

ఐ.రా.స., ఆసియాన్, సి.ఐ.ఎస్., సి.ఎస్.టి.ఓ., ఎకనామిక్ కో ఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస లోని ఆసియా, పసిఫిక్ ఆర్థిక, సామాజిక కమిషన్, వంటి తొమ్మిది అంతర్జాతీయ సంస్థలతో షాంఘై సహకార సంస్థకు విధానపరమైన, ఆచరణాత్మకమైన అవగాహనా ఒప్పందాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోని 42 శాతం జనాభాకు, 23 శాతం జిడిపికి ప్రాతినిధ్యం వహించే దేశాలు షాంఘై సహకార సంస్థలో చేరడంతో తొలినాటి మధ్యాసియా కేంద్రక స్వరూపాన్ని విడనాడి సంస్థ తన స్వరూపాన్ని, పరిధిని విస్తరించుకున్నది.

సభ్యదేశాలలో ఉగ్రవాదాన్ని, వేర్పాటువాదాన్నీ, తీవ్రవాదాన్ని ప్రతిఘటించి పోరాడటం ప్రధాన లక్ష్యంగా షాంఘై సహకార సంస్థ ఏర్పడింది. సభ్య దేశాల మధ్య పరస్పర విశ్వాసాన్ని పటిష్టం చేయడం, పరస్పర ప్రయోజనాల కోసం సమష్టిగా కృషి చేయడం ఈ సంస్థ కీలక లక్ష్యాలు. సభ్యదేశాల మధ్య సమానత్వం, సంప్రదింపులు, నాగరికతల వైవిధ్యం పట్ల గౌరవం, ఉమ్మడి పురోభివృద్ధి కోసం కృషి వంటివి కూడా సంస్థ లక్ష్యాల్లో ముఖ్యమైనవి. విదేశాంగ విధానంలో అలీనత, ఇతర దేశాలపై, ప్రాంతాలపై దాడి చేయకుండా ఉండటం, విధానాల్లో బాహాటత వంటి అంశాలు కూడా సంస్థ లక్ష్యాలలో ఉన్నాయి.

లక్ష్యాల సాధన కోసం జరిగిన కృషి, సమీక్ష కోసం ప్రతి ఏటా దేశాధినేతల, ప్రభుత్వాధినేతల వార్షిక సదస్సులు జరుగుతూ ఉంటాయి. అందుకు సన్నాహకంగా విదేశాంగ, రక్షణ, ఆర్థిక మంత్రుల సమావేశాలు కూడా జరుగుతూ ఉంటాయి. ఉమ్మడిగా ఆసక్తి కలిగిన అంశాలపై సంప్రదింపులు, చర్చలు జరపడం, లక్ష్య సాధనకు అవసరమైన వేదికలను, సంస్థాగత యంత్రాంగాలను , వ్యవస్థలను ఏర్పాటు చేయడం సంస్థ కార్యకలాపాలలో భాగంగా ఉంటున్నాయి. రాజకీయ, వ్యాపార, ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ, సంస్కృతి, విద్య, ఇంధనం, రవాణా, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలలో సభ్య దేశాల మధ్య పటిష్టమైన సహకారాన్ని ప్రోత్సహించడం షాంఘై సహకార సంస్థ బాధ్యతల్లో ముఖ్యమైనది.

షాంఘై సహకార సంస్థ 25వ వార్షిక సదస్సు సెప్టెంబర్ 1, 2, తేదీల్లో చైనాలోని తియాన్ జిన్ నగరంలో జరిగింది. గత పాతికేళ్ల ప్రస్థానంలో ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా "షాంఘై స్ఫూర్తి" ని ముందుకు తీసుకుపోవడంలో సంస్థ గణనీయమైన పురోగతి సాధించిందని సదస్సులో మాట్లాడిన దేశాధినేతలు అభిప్రాయపడ్డారు.

సదస్సు ముగింపు ప్రకటన ఎన్నో కీలకమైన అంశాలను ప్రస్తావించింది. బహుళ ధృవ అంతర్జాతీయ వ్యవస్థ దిశగా మరో ముందడుగు పడిందని ఆ ప్రకటన పేర్కొన్నది. ఉగ్రవాదాన్నీ , వేర్పాటువాదాన్నీ, తీవ్రవాదాన్నీ ఎదుర్కోవడంలో తన నిబద్ధతను సదస్సు మరోసారి నొక్కి వక్కాణించింది. సభ్యదేశాల్లో కొనసాగుతున్న సీమాంతర ఉగ్రవాద ఘటనలను సదస్సు ముగింపు ప్రకటన తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలకు స్థానం లేదని ఆ ప్రకటన స్పష్టం చేసింది. సీమాంతర ఉగ్రవాదం కారణంగానూ, తీవ్రవాద సిద్ధాంతాల వల్లనూ, సభ్యదేశాల అంతరంగిక సుస్థిరత, సరిహద్దు భద్రత, పెను సవాళ్లను ఎదుర్కుంటున్న నేటి

తరుణంలో గూఢచర్య సమాచారాన్ని పంచుకోవడం, సంయుక్త చర్యలు చేపట్టడం, సమన్వయంతో ప్రతి చర్యలు తీసుకోవడం కోసం షాంఘై సహకార సంస్థ ఒక వేదికగా పనిచేయాలని ప్రకటన పేర్కొన్నది. సంస్థ సాగిస్తున్న ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని భద్రతా చర్యలకు మాత్రమే పరిమితం చేయరాదని పేర్కొనడం ద్వారా తన ముందున్న సవాళ్లను సంస్థ సరిగానే గుర్తించిందని భావించాలి. డిజిటల్ యుగంలో ఎదురవుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి వీలుగా షాంఘై సహకార సంస్థ తన చర్యల పరిధిని విశాలం చేయాలని భావించింది.

"ఉగ్రవాదానికి ఆర్థిక సహకారం చేయడాన్ని, ఆన్ లైన్ ద్వారా ఉగ్రవాద ప్రచారం చేయడాన్ని కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని సదస్సు స్పష్టంగా పేర్కొన్నది. సమాచార శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని , ఇంటర్‌నెట్‌ను ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం పూర్తిగా వినియోగించుకుంటున్నాయని, దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చడానికి, ఆంతరంగిక సుస్థిరతను, భద్రతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయని , ఈ "మూడు దుష్ట శక్తుల" పన్నాగాలను కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని సదస్సు గట్టిగా అభిప్రాయపడింది.

ఈ విషయంలో సభ్యదేశాలు ఒక బాధ్యతాయుతమైన, సూత్రబద్ధ, ఆచరణాత్మక వైఖరిని అనుసరించాలని, ఉమ్మడి నియమావళిని పాటించాలని సంస్థ నొక్కి వక్కాణించింది. సంస్థ ఏర్పాటు చేసిన రీజనల్ యాంటీ టెర్రరిస్ట్ స్ట్రక్చర్ (RATS) ఈ విషయంలో మంచి కృషి చేసిందనే చెప్పాలి. టెర్రరిస్ట్ దాడుల కుట్రలను భగ్నం చేయడంలో, టెర్రరిస్టు నేరాలను అడ్డుకోవడంలో , టెర్రరిస్టు బృందాల సభ్యులను, సానుభూతి పరులను అరెస్టు చేయడంలో, ఆయుధాలు, పేలుడు పదార్థాల స్వాధీనంలో రాట్స్ మంచి ఫలితాలు సాధించింది. దాంతో యురేషియా ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణలో షాంఘై సహకార సంస్థకు గల భూమికను ఐరాస కూడా గుర్తించింది.

కృత్రిమ మేధ, డిజిటల్ ఆర్థికాభివృద్ధి వంటి రంగాల్లో సభ్యదేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని పెంపొందించాలని, కృత్రిమ మేధ అభివృద్ధిలో, వినియోగంలో సభ్య దేశాలన్నిటికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని సదస్సు భావించింది. రానున్న దశాబ్ద కాలానికి (2025 - 2035) సదస్సు రూపొందించిన అభివృద్ధి వ్యూహంలో వ్యాపార, పెట్టుబడుల సహకారాన్ని పెంపొందించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నది. వ్యాపార ఆంక్షలను తగ్గించడం, పెట్టుబడులు స్వేచ్ఛగా ప్రవహించేటట్లు చూడటం, ఇతర దేశాల మార్కెట్లపై , కరెన్సీలపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యంగా కృషి చేయాలని సదస్సు భావించింది.

డాలర్ లావాదేవీలపై, పశ్చిమదేశాల ద్రవ్య వ్యవస్థలపై ఆధారపడకుండా షాంఘై సహకార సంస్థ ఆధ్వర్యంలో "ఎస్.సి.ఓ. అభివృద్ధి బ్యాంకు" ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై సభ్యదేశాలు ఈ సదస్సులో కొంత ముందంజ వేశాయి. సభ్యదేశాలకు రెండు బిలియన్ యువాన్ల ఆర్థికసాయం చేయడానికి, మరో పది బిలియన్ యువాన్ల రుణాలు ఇవ్వడానికి ఎస్.సి. ఓ. బ్యాంకింగు కన్సార్టియం కు అందుబాటులో ఉంచుతామని చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ సదస్సులో ప్రకటించడం పెద్ద ముందడుగు. అయితే ఇలాంటి వేదికలపై ఆమోదించే గంభీరమైన ప్రకటనలకు, ఆచరణలకు పొంతన లేకపోవడం వల్లనే పాతకాలపు వ్యవస్థలు తమ సామర్థ్యాన్ని కోల్పోయిన వాస్తవాలను కూడా సంస్థ గమనించిందనే చెప్పాలి.

సీమాంతర ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ ప్రమాణాలను విడనాడాలన్న సదస్సు పిలుపు ఆసక్తికరమైనది. సంస్థ 25 వ వార్షిక సదస్సుకు సన్నాహకంగా జరిగిన రక్షణ మంత్రుల సమావేశం రూపొందించిన ప్రకటనలో పహల్గాం ఉగ్రవాద ఘటన గురించిన ప్రస్థావన లేకపోవడంతో దానిపై సంతకం చేసేందుకు భారత్ నిరాకరించింది. పహల్గాం ఘటనతో పాటు, పాకిస్తాన్‌లో సంభవించిన రెండు ఉగ్రవాద ఘటనలను ముగింపు ప్రకటనలో ప్రస్తావించడం ద్వారా భారత్, పాక్ వాదనలకు సదస్సు చోటు కల్పించిందని భావించాలి.

భారత్, పాక్, చైనా దేశాల మధ్య సరిహద్దు సమస్యలు ఉన్నాయి. కొన్ని మధ్యాసియా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉన్నాయి. అవి తరచూ స్వల్ప ఘర్షణలకు, సైనిక చర్యలకు ఆస్కారం ఇస్తున్నాయి. అమెరికా, నాటో, యూరోపియన్ యూనియన్ దేశాల తాజా వైఖరులు, నిర్ణయాల నేపథ్యంలో షాంఘై సహకార సంస్థ ప్రాధాన్యం మరింత పెరిగింది.

డొనాల్డ్ ట్రంప్ అసంబద్ధ నిర్ణయాలు చైనా రష్యా, భారత్ దేశాలను ఒక వేదికపైకి తీసుకువచ్చాయి. సభ్య దేశాల సమాజాల మధ్య రాజకీయ, ఆర్థిక, సామాజిక, వైవిధ్యాలు ఎన్నో ఉన్నాయి. దేశాల స్వీయ ప్రయోజనాలు, జాతీయ ఆకాంక్షలు, సరిహద్దు ఉద్రిక్తతలు షాంఘై స్ఫూర్తికి మార్గావరోధాలుగా ఉన్నాయి. ఆయా దేశాల అధినేతలు తమ తమ దేశాల్లో తీసుకుంటున్న తీవ్ర రాజకీయ వైఖరులు, ఎన్నికల ప్రచార ఆర్భాటాలు కూడా షాంఘై స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటున్నాయి. సంభాషణలు, సంప్రదింపుల ద్వారా సమస్యల పరిష్కారానికి అర్థవంతమైన చర్యలు తీసుకోవాలని తియాన్ జిన్ సదస్సు నొక్కి చెప్పడం ప్రస్తుత పరిస్థితుల్లో ఆశాజనకంగా కనిపిస్తున్నది.

డి. సోమ సుందర్

# ఆంక్షలు, సుంకాలపై ఆచరణాత్మకత తప్ప.. గొప్పలొద్దు, మోకరిల్లనక్కర్లేదు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

భారత్ నుండి దిగుమతులపై అమెరికా తాజాగా సుంకాల్ని పెంచటం పాత సామెతను గుర్తుచేస్తోంది. దేశాలకు శాశ్వత మిత్రులుండరు, శాశ్వత శత్రువులుండరు.. కేవలం శాశ్వత ప్రయోజనాలుంటాయి! ఈమధ్య కూడా అమెరికాతో మన సంబంధాలు బ్రహ్మాండంగా ఉన్నట్లు కనిపించాయి. ఉన్నట్లుండి ఇప్పుడు వాణిజ్య యుద్ధం మనపై విరుచు కుపడింది.

అధ్యక్షుడు ట్రంప్ అమెరికా ఫస్ట్ పాలసీలో భాగంగా భారత్ లోని చాలా వస్తువులపై విధించిన 25% సుంకాన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోలును కొనసాగిస్తున్నందుకు ఆగస్టు 6న అదనంగా జరిమానాగా విధించిన 25%.. రెంటినీ వేర్వేరుగా చూడటం మంచిది.



మొదటి విడత ఆంక్షలపై ప్రధానమంత్రి మోదీ శషభిషలు లేకుండానే తేల్చి చెప్పారు. “భారత్ తన రైతులు పశు పెంపకందారులు, మత్స్యకారుల ప్రయోజనాలపై తలొగ్గదు. ఎంత భారమైనా మోస్తుంది”. వాణిజ్య చర్చలకు సంబంధించి ఇరుపక్షాలకూ స్పష్టమైన పరిధిలున్నాయి. మన మౌలిక వ్యూహాత్మక ప్రయోజనాలని ఒడుపుగా పరిరక్షించుకోవాలి. నిర్లక్ష్య దుస్సాహసం పనికి రాదు. అదే సమయంలో మెతకదనంతో మోకరిల్లటం వల్లా మన ప్రయోజనాలు నెరవేరవు.

మనకు నిజంగా లాభదాయకంకాని, అదేసమయంలో ట్రంప్ విచిత్ర వైఖరికి నచ్చే అంశాలపై మనం వెనక్కి తగ్గొచ్చు. ఉదాహరణకి, హార్లే డేవిడ్ సన్ మోటారు బైక్ ల మీద సుంకాన్ని తగ్గించటం సమస్య కాదు. మనం భారతీయ వినియోగదారుడి బేరసారాల విజ్ఞతను విశ్వసించాలి. డబ్బు పెట్టి కొనుగోలు చేసేటప్పుడు ఆచితూచి వ్యవహరిస్తాం. మన సొమ్ములకు తగ్గ విలువ మార్కెట్‌లో దక్కాలని కోరుకుంటాం. సుంకాల్ని తగ్గించటం వల్ల.. పేరొందిన బ్రాండ్ వస్తువుల దిగుమతులు భారీగా పెరిగే అవకాశం లేదు. అంతేస్థాయి లేదా అంతకంటే మెరుగైన ఉత్పత్తులు మన మార్కెట్ లో అప్పటికే అందుబాటులో ఉన్నప్పుడు!

వంటనూనె వంటి సరకులపై సుంకాల విషయంలో మాత్రం మనం గట్టిగా నిలబడాలి. భారత్ ఈ రంగంలో అతిపెద్ద దిగుమతిదారు. మన వంటనూనెల వినియోగంలో 60% దాకా దిగుమతి చేసుకుంటున్నాం. సుమారు 2.5 కోట్ల మంది రైతులు నూనెగింజలు సాగుచేస్తున్నారు. ఒక కీలక ఆహార అవసరంపై మనం ఎల్లవేళలా దిగుమతులపై ఆధారపడి ఉండలేం. కాబట్టి, మన ఆహార భద్రతను సాధించే క్రమంలో భారతీయ రైతులకు సుంకాల నుండి రక్షణ కల్పించటంపై మరోమాటకు తావు లేదు.

జన్యుమార్పిడి పంటల (జీఎంఓలు) విషయంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా మనం స్వాగతించాలి. జీఎంఓలను తిరస్కరించే మన కరడుగట్టిన స్వదేశీ ఆలోచనాతీరును మార్చుకోవటం సరైన వ్యవహారశైలి. భారత్ లో హీలియోథిస్ ను తట్టుకునే బీటీ పత్తి సాధించిన అద్భుత విజయం మనకు మంచి నమూనా. జీఎంఓలను సరైన ప్రమాణాల ఆధారంగా అందిపుచ్చుకోవాలి.

అవసరమైన జీన్‌ని ప్రవేశపెట్టటం ద్వారా మనం ఎంపిక చేసుకున్న రీతి ఉత్పత్తుల్ని సాధించటం జీఎంఓలు. ఇదేమీ కొత్త విషయం కాదు. గత 10,000 సంవత్సరాలుగా వ్యవసాయంలో జరుగుతున్నదే. మనం ప్రయోజనకరమని భావిస్తున్న లక్షణాలతో పంటల ఉత్పత్తి కోసం.. అంటుకట్టటం వంటి వివిధ పద్ధతుల్లో మానవాళి అపార శ్రమకోర్చింది. ఆధునిక జన్యు సాంకేతికత అదే పనిని అనేకరెట్లు వేగంగా, లక్ష్యం పట్ల కచ్చితత్వంతో చేస్తుంది. కేవలం సురక్షితమైన జీఎం విత్తనాలు మాత్రమే దేశంలోకి ప్రవేశించేలా మనకు పటిష్ఠ నియంత్రణా వ్యవస్థలున్నాయి. ప్రజా ప్రయోజనాల్ని కాపాడటానికి నిర్దిష్ట నియమ నిబంధనలున్నాయి.

ఆహారంలో జన్యువులుగానీ, క్రోమోజోములుగానీ మనిషికి

హాని చేస్తాయని ఒక్కటి కూడా నిరూపిత సాక్ష్యం లేదు. జంతువు నుంచి లేదా మొక్కల నుండి మనం తినే ప్రతి దాంట్లో జన్యువులుంటాయి. అమెరికా, చైనా, బ్రెజిల్ లాంటి వ్యవసాయ దిగ్గజాలు జన్యు సాంకేతికతను పెద్దెత్తున అనుసరిస్తున్నాయి. పంటల ఉత్పాదకతల్ని, తమ ఆహారోత్పత్తుల నాణ్యతను పెంచుకుంటున్నాయి. ఐరోపా అసంబద్ధ, పక్షపాత ధోరణులు, పద్ధతులు, సైద్ధాంతికత పేరుతో కొన్ని సంస్థలు చేసే అహేతుక వాదనల ప్రభావానికిలోనై జీఎం ఓలను ఆపుకోవటం అర్థరహితం. అది స్వీయ ఓటమి.

మనం మన మౌలిక ప్రయోజనాల్ని గుర్తించాలి. మన రైతుల్ని, వినియోగదారుల్ని కాపాడుకోవటం, పెట్టుబడుల్ని, ప్రగతిని ప్రోత్సహించటం, అంతర్జాతీయంగా పోటీ పడే శక్తిని పెంచుకోవటం మనకు కీలకం. ఒక్కసారి మన జాతీయ ప్రయోజనాల పరిరక్షణలో మనం స్పష్టంగా, హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా వ్యవహరించినప్పుడు.. భారత్ 10-15% సుంకాల పరిధిలోకి వచ్చే సహేతుక అవకాశం ఉంటుంది. సుంకాలు అంతిమంగా అమెరికా వినియోగదారులు, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ సమస్య. అమెరికాకు ఎగుమతి చేసే దేశాల్లో భారత్‌కి ఎక్కువ సానుకూలత ఉండటం మాత్రమే మనం పట్టించుకోవాల్సిన విషయం. మన మీద విధించిన సుంకం, ఇతర పోటీదారులపై విధించిన దానికంటే తక్కువగా, కనీసం ఎక్కువ కాకుండా ఉండటం అన్నదే మనకు కీలకాంశం.

మనం అంత ఆందోళన చెందనక్కర్లేదు. మన వ్యూహాత్మక వ్యవహారశైలి స్పష్టమైన ఆలోచనతో ఉండటం అవసరం. సైద్ధాంతిక రాద్ధాంతాలు లేకుండా..ప్రపంచంలో అతి పెద్ద మార్కెట్, మనకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అయిన అమెరికాకు ఎగుమతుల్లో పోటీతత్వంపైనే మనం దృష్టి కేంద్రీకరించాలి.

ఇప్పుడు రష్యా నుంచి చమురు కొనుగోలును కారణంగా చూపుతూ అమెరికా విధించిన 25% జరిమానా సుంకాల విషయానికొద్దాం. ప్రపంచ మార్కెట్ నుంచి రష్యా చమురును తొలగించాలనుకోవటం పాశ్చాత్య దేశాల హ్రస్వ దృష్టికి నిదర్శనం. ముఖం మీద కోపంతో ముక్కును తెగ్గోసుకోవటమంటే ఇదే.ఉక్రెయిన్ పై రష్యా దురాక్రమణ దేశాల సార్వభౌమాధికార హక్కుకి, ఆధునిక రాజనీతికి పూర్తి విరుద్ధం. అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ సంక్షేమం ఆధారపడిన కీలక వస్తువులపై ఆ కారణంగా ఆంక్షలు విధించటం చాలా తెలివిమాలిన విధానం. చమురు ఆంక్షల్ని ఎదుర్కొంటున్న ముడి చమురు సంపన్న దేశాలలో గరిష్ఠ ఉత్పత్తి గణాంకాలే ఇందుకు నిదర్శనం.

వెనిజువెలా అత్యధిక స్థాయి చమురు ఉత్పత్తి రోజుకు 3.7 మిలియన్ బ్యారెళ్లు. ఇరాన్ ఉచ్ఛదశలో ఉన్నప్పుడు 1976లో 6.6 ఎంబీడీలు. రష్యా ఉత్పత్తి 2024లో 10.9 ఎంబీడీలు. ఈ గణాంకాల్ని పైపైన చూసినా మనకు అర్థమవుతుంది – ఈ మూడు దేశాల్నీ ప్రపంచ చమురు మార్కెట్ నుంచి తప్పిస్తే మిగిలిన దేశాలు 21 బీడీలు నష్టపోవాల్సి ఉంటుంది. మొత్తం ప్రపంచం ముడి చమురు ఉత్పత్తి 90 ఎంబీడీలు. ఆ మూడు దేశాల గరిష్ఠ స్థాయి ఉత్పత్తి ఇందులో 23%. ఇప్పుడు కూడా ఆ దేశాలు 14 ఎంబీడీల మేర ఉత్పత్తి చేస్తున్నాయి (రష్యా: 10.5 ఎంబీడీబీ ఇరాన్ 3.25 ఎంబీడీబీ వెనిజువెలా 0.9 ఎంబీడీ). ఇది ప్రపంచ ఉత్పత్తిలో 15% పైగా.

మనం అంత ఆందోళన చెందనక్కర్లేదు. మన వ్యూహాత్మక వ్యవహారశైలి స్పష్టమైన ఆలోచనతో ఉండటం అవసరం. సైద్ధాంతిక రాద్ధాంతాలు లేకుండా..ప్రపంచంలో అతి పెద్ద మార్కెట్, మనకు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అయిన అమెరికాకు ఎగుమతుల్లో పోటీతత్వంపైనే మనం దృష్టి కేంద్రీకరించాలి.

పాశ్చాత్య దేశాలు గనక ఈ మూడు దేశాల చమురు మార్కెట్లని మూసివేయిస్తే, చమురు ధరలు గణనీయంగా పెరుగుతాయి. ప్రపంచ వృద్ధి తీవ్రంగా దెబ్బతింటుంది. అంతర్జాతీయ సమాజం పెనుసంక్షోభంలో కూరుకుపోతుంది. విచక్షణలేని ఆంక్షలే ఈ మొత్తానికీ కారణమవుతాయి.

ఇరాన్‌కి వ్యతిరేకంగా చమురు ఆంక్షలను భారత్ పాటించింది. రష్యా చమురు విషయంలో కూడా మనకు వేరే మార్గం ఉండకపోవచ్చు. తలొగ్గాల్సి రావొచ్చు. దీనివల్ల మనం బ్యారెల్కి 5-10 డాలర్ల రాయితీని కోల్పోవాల్సి ఉంటుంది. అంటే, ఏడాదికి 5 బిలియన్ డాలర్ల భారం. కానీ భారీ సుంకాలు ఇంతకంటే ఎక్కువ భారం. మన ఆర్థిక వ్యవస్థ తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఏతావాతా, రష్యా చమురు కొనుగోలు ద్వారా చైనా మరిన్ని రాయితీల్ని పొందే అవకాశం ఉంది. విచిత్రంగా, అమెరికా, పాశ్చాత్య దేశాల విచక్షణారహిత ఆంక్షల విధానం వారి ప్రబల శత్రువు చైనాను బలోపేతం చేస్తుంది. మనం ఆంక్షలు పాటించటానికి అంగీకరిస్తూనే.. ఆహారం, ఎరువులు, ఇంధనం, కీలక అరుదైన ఖనిజాలు మొదలైన వాటిని ఆంక్షల చట్రం నుంచి తప్పించే చర్యలు తీసుకోవాలి. సమస్య ఏదైనా కావచ్చు, వ్యాధి కంటే చికిత్స భయంకరం కాకూడదు. ★

# బీసీలకు 42% రిజర్వేషన్లు - స్థానిక ప్రభుత్వాల సాధికారత

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

సుమారు రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలిచ్చిన తీర్పులో భారత రాజకీయాలకు దిక్సూచి లాంటి ఒక ఒరవడి కనిపించింది. అంతకుముందు కూడా ఆ ధోరణి కొంత కనిపించినా, తెలంగాణ శాసనసభ తాజా ఎన్నికల్లో స్పష్టతను సంతరించుకుంది. ఓటరు జాబితాల్లోని లోపాలపై రాజకీయ విమర్శలను అలా ఉంచితే.. తెలంగాణ తర్వాత జరిగిన ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఆ తీరు ప్రతిఫలించింది. అదేమిటీ? "సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా కావాలని ఓటర్లు స్పష్టమైన సంకేతాన్నివ్వటం".

బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్‌కు సాంప్రదాయంగా బలం ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీ ఓడిపోగా.. సంస్థాగతంగా బలహీనంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం మెజారిటీ స్థానాల్ని గెలుచుకుంది. అంతకుముందు డిపాజిట్లు కోల్పోయి, ఆ తర్వాత బీఆర్ఎస్ కు ప్రధాన ప్రత్యర్థిగా ఎదిగిన కాంగ్రెస్ జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. దీనికి కారణమేంటి?

'అభివృద్ధి ఫలాలు కళ్ల ముందు కనిపిస్తూ అందులో కొంత వాటా దక్కుతున్నందున హైదరాబాద్‌లో, కొన్ని ఇతర పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఎక్కువ ఫలితాల్ని సాధించగలిగింది. ఆ ఫలితాలు సరిగా చేరని గ్రామీణ తెలంగాణలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుచుకుని అధికారంలోకి రాగలిగింది'. అభివృద్ధిని సమ్మిళితం చేసి.. అందులో కీలకాంశంగా స్థానిక ప్రభుత్వాలకు తగినన్ని నిధుల్ని, అధికారాల్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చి ఉంటే, ఈ పరిస్థితి తలెత్తేది కాదేమో!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ ప్రభుత్వం కొలువు తీరాక కలెక్టర్లతో జరిగిన మొదటి సమావేశంలోనే, మన దేశంలో స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి అమెరికా నుంచి వచ్చి మరీ స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలోనే కృషి చేసిన ఎస్.కె. డే గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ఘనంగా



మాట్లాడారు. ఆ తర్వాత తెలంగాణ పంచాయతీల అభివృద్ధి కోసం వచ్చే నాలుగేళ్లలో రూ.25,000 కోట్లు ఖర్చు పెడతామని 2014-15 లో 'గ్రామజ్యోతి' పేరుతో పథకాన్ని ప్రకటించారు. ఆ సమయంలో నేను ఎంతో సంబర పడిపోయి బహిరంగంగానే కేసీఆర్ ప్రభుత్వాన్ని అభినందించాను. వరంగల్ జిల్లా గంగదేవిపల్లి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి.. ఆ తర్వాత గ్రామ జ్యోతి ఊసెత్తటం మానేశారు. ప్రధానమంత్రి-ముఖ్యమంత్రి-కలెక్టర్ (పీఎం-సీఎం-డీఎం) వ్యవస్థనే కొనసాగించారు. ఆ తర్వాత మునిసిపల్ చట్టంలో హక్కుగా పౌర సేవలకు సిటిజన్ చార్టర్లు అంటూ హడావుడి చేసి, ఆలస్యమైతే దరఖాస్తుదారునికి పరిహారం చెల్లించే ఏర్పాటు లేకుండా వాటిని నామమాత్రం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద బోర్డులు తప్ప హక్కులు లేవు.

కేసీఆర్ ప్రభుత్వ ఓటమికి వివిధ కారణాలు ఉండుండొచ్చు. కానీ గ్రామజ్యోతి వంటి స్థానిక సాధికారత కార్యక్రమాల్ని సక్రమంగా అమలు చేసి, సమ్మిళిత అభివృద్ధితో గ్రామీణ-పట్టణ అంతరం తగ్గించి ఉంటే, ఓటర్లలో అంత అసంతృప్తి

**బీఆర్ఎస్ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ తెలంగాణ గ్రామాలకు నిధులు అందటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చే నిధులు శూన్యం కాగా, స్థానిక ఎన్నికలు సకాలంలో జరపకపోవటం వల్ల యూనియన్ నుంచి వచ్చే నిధులు కూడా ఆగాయి. మా పదవీకాలంలో అప్పు చేసి చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి మహాప్రభో.. అని సర్పంచ్‌లు హైదరాబాద్ వచ్చి ఆందోళనలు చేసే పరిస్థితి.**

ఏర్పడేది కాదేమో!

2025లో ఢిల్లీ ప్రజలు ఇంకా పరిణతి చెందిన సందేశమిచ్చారు. దేశంలోనే అత్యంత భారీ తాత్కాలిక తాయిలాల్ని ఇచ్చినా, అభివృద్ధి ఉన్నా కూడా.. రోజువారీ స్థానిక పాలన సవ్యంగా లేకుంటే ఓటు వేయం అని తేల్చి చెప్పారు. ఈ పరిస్థితి క్రమంగానైనా అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తుంది. సంక్షేమం-అభివృద్ధి సమతూకంతోపాటు.. కాలుష్య నివారణ దగ్గర్నుంచి విద్య, వైద్యం, ఇతర పౌర సేవల నాణ్యత సక్రమంగా ఉంటేనే ఓట్లు పడతాయి. అంటే, స్థానిక ప్రభుత్వాలు సవ్యంగా, సమర్థంగా పనిచేయాలి!ఇది రాజకీయ చర్చలా కనపడవచ్చు కానీ రాజకీయం, ఎన్నికల లక్ష్యమైన పరిపాలనలో అత్యంత కీలకమైన అధికార వికేంద్రీకరణకు, మూడో అంచె ఫెడరలిజానికి సంబంధించిన విషయం.

బీఆర్ఎస్ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ తెలంగాణ గ్రామాలకు నిధులు అందటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చే నిధులు శూన్యం కాగా, స్థానిక ఎన్నికలు సకాలంలో జరపకపోవటం వల్ల యూనియన్ నుంచి వచ్చే నిధులు కూడా ఆగాయి. మా పదవీకాలంలో అప్పు చేసి చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి మహాప్రభో.. అని సర్పంచ్‌లు హైదరాబాద్ వచ్చి ఆందోళనలు చేసే పరిస్థితి.

తెలంగాణకు ఇతర రాష్ట్రాలు పోటీ కాదు.. ఇతర దేశాలతోనే పోటీ పడతాం అని ప్రస్తుత ముఖ్యమంత్రి అంటున్నారు. సంతోషం. కానీ అలా పోటీ పడగలిగిన దేశాల్లో స్థానిక ప్రభుత్వాలకు ఎన్ని నిధులు, అధికారాలు ఇస్తారో గమనించారా? జనాభాలో మనతో పోల్చదగిన




చైనానే తీసుకుంటే.. మొత్తం దేశ వ్యయంలో 60% దాకా నిధుల్ని స్థానిక ప్రభుత్వాల ద్వారానే ఖర్చు చేస్తారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వటానికి కులగణన ఎందుకో తెలియదుగానీ, కులగణన ద్వారా వారికి ఆ మేరకు రిజర్వేషన్లు ఇచ్చి త్వరలో ఎన్నికలు జరుపుతామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. న్యాయస్థానం కూడా ఎన్నికలను త్వరగా జరపాలని ఆదేశిస్తోంది. అయితే ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల ద్వారా సర్పంచ్‌లయిన ఎస్.సి, ఎస్.టి, బీసీ, మహిళలకు నిధులు, అధికారాలు ఉన్నాయా? ఆ సాధికారత లేకుండా బీసీలకు 42% సహా అదనంగా రిజర్వేషన్లకు పార్లమెంటు, సుప్రీంకోర్టు సైతం ఒప్పుకున్నా.. దానివల్ల బీసీలకు ఒరిగేదేమిటి ఉత్సవ విగ్రహాలుగా మిగలటం మినహా? అన్న ప్రశ్నలను లేవనెత్తకుండా, చర్చించకుండా కులగణనను ఓ సైద్ధాంతిక అంశంగా కాంగ్రెస్ సహా కొన్ని రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంస్థలు ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నాయి.

తెలంగాణ వేగంగా పట్టణీకరణ చెందుతోంది. అభివృద్ధికి పర్యాయపదం పట్టణీకరణ. దానర్థం అందరూ హైదరాబాద్ కి రమ్మని కాదు. తెలంగాణ, ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా పట్టణీకరణలో ఈ రకమైన లోపం ఉండటం వల్లే, ఎక్కువమంది ప్రజలు ఇప్పటికీ తక్కువ ఆదాయమున్న వ్యవసాయం నుంచి ఉపాధి పొందుతున్నారు. ఈ లోపాన్ని సరిచేయటానికి ఇప్పటికే 12,780 దాకా ఉన్న పంచాయతీల సంఖ్యను ఇంకా పెంచటం కాకుండా, గణనీయంగా కుదించాలి. 1000 - 2000 కి చేర్చాలి. స్థానిక ప్రభుత్వాల సాధికారతకు పెద్దపీట వేసి లాభపడుతున్న కేరళలో మొత్తం పంచాయతీల సంఖ్య సుమారు 900 మాత్రమే. అలా సాముదాయక (క్లస్టర్) పంచాయతీల వల్ల ఆదాయాలు పటిష్ఠమవుతాయి. దేశంలోని 146 కోట్ల జనాభాలో 86.95 కోట్ల మంది నివసించే పంచాయతీల మొత్తం సొంత ఆదాయం 2017-2022లో కేవలం రూ.5,118.98 కోట్లు. అంటే తలసరి పన్నుల రూపేణా రూ.59.

బీసీలు, ఇతర వర్గాలకు రిజర్వేషన్ల వల్ల ఫలితం ఉం

డాలన్నా, త్వరలో అమల్లోకి రాబోతున్న మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సద్వినియోగం గావించుకునేలా స్త్రీలు సమర్థంగా వ్యవహరించాలన్నా, యువత పౌరసత్వాన్ని, నాయకత్వాన్ని పెంపొందించుకోవాలన్నా..స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కోసం అన్ని వర్గాల ప్రజలూ కలసికట్టుగా పనిచేయాలి. అందులో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారానికి తమ కెరీర్‌లు చూసుకుంటూనే పనిచేస్తుండాలి. అయితే ఈ మొత్తం ప్రక్రియను ఒక క్రమపద్ధతిలో, చట్టబద్ధంగా చేయటం అవసరం.

క్లస్టర్ పంచాయతీలతో గ్రామాల మధ్యే చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం మీద దృష్టి కేంద్రీకరించాలి. గ్రామాల్లో కాస్త తక్కువ నైపుణ్యాలున్నవారు పొట్ట చేత పట్టుకుని మహానగరాలకు వలస వచ్చి దుర్భర జీవితాల్ని గడపాల్సిన అవసరం లేకుండా చిన్న పట్టణాల్లోనే వృత్తి వ్యాపారాలకు ఎంతో ఉపయోగపడతాయి. నైపుణ్యాలు పెరిగాక, ఆసక్తి ఉంటే మహానగరాల గురించి వారు ఆలోచించుకోవచ్చు.

**ఉన్న చట్టాల్నీ క్షుణ్ణంగా చదవండి**

ఇక చట్టబద్ధంగా గ్రామ పంచాయతీల్లో, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజాప్రతినిధులకు ఇప్పటికే కొన్ని అధికారాలు పరిమితంగానైనా ఉన్నాయి. పంచాయతీలు, పట్టణ, నగర స్థానిక ప్రభుత్వాల్లో చట్టాల్ని సమర్థంగా ఎలా ఉపయోగించుకోవాలో లోక్‌సత్తా అనేక సందర్భాల్లో శిక్షణా తరగతుల్ని నిర్వహించింది. సొంతంగా సమాచారాన్ని ప్రచురించి పంపిణీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టాల గురించి ఈమధ్య కాలంలో తెలుగులో కొన్ని పుస్తకాలు కూడా వచ్చాయి. వాటిని స్థానిక ప్రభుత్వాలకు పోటీ చేస్తున్న మహిళలు, బీసీలు సహా రిజర్వేషన్ వర్గాలు, యువత, ఇతర ప్రజానీకం జాగ్రత్తగా చదవాలి. ఎన్నికలై ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు తీసుకునే సమయంలోనూ అధ్యయనం చేయాలి. వీరితోపాటు..



రాష్ట్ర, జాతీయ స్థాయినేతలు, ఆయా పార్టీల అగ్రనేతలు, పాలకులు కూడా రాజ్యాంగ, చట్టస్ఫూర్తిని, సమాచారాన్ని లోతుగా పరిశీలించాలి. ఎందుకంటే, ఒక చిన్న రాష్ట్రంలో మహా నగరం ఉండటం వల్ల తెలంగాణ తలసరి ఆదాయం ఢిల్లీతో పోటీ పడుతోంది. పైగా పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. రోజువారీ పాలనకు కీలకమైన స్థానిక ప్రభుత్వాలకు నగరాల్లో, గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం ద్వారా సాధికారత కల్పించకపోతే.. ఎంత గొప్ప పార్టీ, నాయకుడినైనా ప్రజలు ఓడిస్తారనటంలో సందేహం లేదు.

భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలోనైనా.. అందులో తొలినాళ్లలో దొర్లిన ఒక లోపాన్ని సరిచేయబోయి 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా చేసిన ఇంకో తప్పిదాన్ని సరిచేయాలి. స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నవారు, కేవలం అధికారంలోకి రావటం కాకుండా ప్రజలకు కొంతైనా సేవ చేసి గుర్తింపు పొందాలనుకుంటున్నవారు, మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా అసెంబ్లీ, పార్లమెంటుకి వెళ్లాలనుకుంటున్నవారు, భవిష్యత్తులో నాయకులుగా ఎదగాలనుకుంటున్నవారు, రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నవారు, ప్రభుత్వోద్యోగులు, మెరుగైన ప్రజాస్వామ్య తెలంగాణ, భారత్ కోరుకుంటున్నవారు వార్డు స్థాయి వరకూ స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం కృషి చేయటం అత్యవసరం. ★

## స్థానిక సంస్థల ఎన్నికలను ఇంకా ఆలస్యం చేయొద్దు

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సుపరిపాలన వేదిక (ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు వేదిక అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.'రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ఆపినట్లుగా తెలు స్తోంది. రిజర్వేషన్లను మేం స్వాగతిస్తున్నాం. బీసీ రిజర్వేషన్ల సమస్య ఇప్పట్లో తేలేలా లేనందున వాటిని వేరు చేసి త్వరగా ఎన్నికలు జరిపించాలి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పా టైంది. ఈ కమిషన్ స్థానిక ఎన్నికలను సమయానుకూలంగా నిర్వహిస్తుంది. 2019 తెలంగాణ మునిసిపల్ చట్టంలో భాగం గా రాష్ట్ర ప్రభుత్వం తన అంగీకారంతోనే ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించేలా సెక్షన్ 195 ను తెచ్చింది. ఇది రాజ్యాంగ విరు ద్ధం. దీనిని వెంటనే రద్దు చేయాలి. 20 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వ అంగీకారంలేక పలు ఎన్నికలు ఆగిపోవటంతో యూనియన్ నుంచి వచ్చే సుమారు రూ.2,300 కోట్ల నిధులు ఆగిపోయాయి. దీంతో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి' అని పేర్కొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళన..ఎన్నికల సంస్కరణలు

# లోక్‌సత్తా పరిష్కారమే మార్గం



బీహార్ రాష్ట్ర ఎన్నికలకు కొన్ని నెలల ముందు భారత ఎన్నికల సంఘం (ECI) రాష్ట్ర ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)ను ప్రారంభించింది. ఎన్నికలకు ముందు ప్రారంభించిన ఓటర్ల జాబితా సవరణ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అనర్హులు, నకిలీ ఓటర్లతోపాటు విదేశీయులను ఈ జాబితా నుంచి తొలగించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది. ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు పదో తరగతి జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు వంటి 11 రకాల డాక్యుమెంట్లలో ఏదైనా ఒకదాన్ని చూపెట్టాలని ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే ఇందులో ఆధార్, పాన్ డ్రైవింగ్ లైసెన్స్ వంటివి లేకపోవడం వివాదానికి కారణమైంది. ఈసీ తో పాటు యుఐడిఐ కూడా ఆధార్ కేవలం ఐడీ ప్రూఫ్ మాత్రమేనని పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి కాదని పేర్కొంటున్నాయి. దీనిపై ప్రతిపక్షపార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో దీనిపై నిరసనలు వ్యక్తం అయ్యాయి. 'ఓట్ల చోరీ' అంటూ పార్లమెంట్ సమావేశాల్లో సైతం ఈ అంశాన్ని లేవనెత్తాయి..పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశాయి. మహారాష్ట్రలో మాదిరిగానే బీహార్లో ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఏకంగా 65 లక్షల మందిని సరైన విచారణ కూడా లేకుండానే మృతులు, వలసదారులుగా ముద్రవేసి జాబితా నుంచి తొలగించారని ఆరోపించాయి. తమకు అనుకూలమైన వారి ఓట్లు మాత్రమే జాబితాలో ఉండేలా మార్పులు చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించాయి. ముఖ్యంగా 11 గుర్తింపు పత్రాల్లో ఆధార్ వంటివి లేకపోవడాన్ని సవాలు చేశాయి. ఎన్నికలకు కొద్ది రోజులు ముందే ఈ ప్రక్రియను చేపట్టడాన్ని తప్పు పడు తున్నాయి. సుప్రీంకోర్టు సైతం ఆధార్‌ను గుర్తింపు కార్డుగానే పరిగణించాలని పేర్కొంది. అయితే బీహార్‌లో ఎన్నికల జాబితా ధ్రువీకరణకు ఈసీకి ఉన్న అధికారాలపై కీలక ప్రశ్నలు లేవనెత్తింది..బీహార్ తర్వాత దేశవ్యాప్తంగాను 'సర్'ను అమలు చేస్తామని ఈసీ ప్రకటించింది..ఈ నేపథ్యంలో ఈ వివాదం..లోక్‌సత్తా సూచిస్తున్న ప్రత్యామ్నాయ విధానాలను పరిశీలిద్దాం.

**తప్పిదాలు ఉన్నాయి..కానీ..**

ఎన్నికల సంఘం (ఈసీఐ) పోలింగ్ బూత్ లోపల స్వేచ్ఛగా ఓటు వేసేలా నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడంతో పాటు, ఫలితాల్ని నిర్దిష్ట కాలవ్యవధిగాలోగా ప్రకటించటం, వాటిని స్థూలంగా పార్టీలు ఆమోదించటం, శాంతియుతంగా అధికార మార్పిడి జరగటం, గెలిచినవాళ్ళు ఓడినవాళ్ళని శత్రువుల్లా ఉరితీయకపోవటం వంటివి మన ప్రజాస్వామ్యాన్ని బలంగా నిలబెడుతోంది. పోలింగ్‌బూత్ బయట మన ఎన్నికలు అక్రమ డబ్బుమయమై అపహాస్యం పాలవుతున్నా ఎవరూ ఓటర్లను తుపాకీతో బెదిరించి ఫలానా అభ్యర్థి పార్టీకే వేయాలనే పరిస్థితి అయితే లేదు. ప్రజాస్వామ్యానికి ప్రాణపదమైన ఎన్నికల్ని ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్ల మధ్య సవ్యంగా నడిపిస్తూ ఏ అడవుల్లోనో, కొండమీదో ఒక్క ఓటరు ఉన్నా కూడా పోలింగ్‌బూత్‌ని ఏర్పాటుచేస్తూ, అంతర్జాతీయ పరిశీలకుల నుంచి కూడా ప్రశంసల్ని పొందుతూ, కొన్ని విషయాల్లో అమెరికా లాంటి శతాబ్దాల ప్రజాస్వామ్యం కంటే మెరుగ్గా వ్యవహరిస్తూ, దేశీయంగా ప్రజల్లో గణనీయ విశ్వసనీయతను, ప్రతిష్టను మూటగట్టుకున్న అలాంటి ఈసీపై ఇప్పుడు ఓట్ చోర్ తరహా ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అయితే, రాహుల్ గాంధీ కానీ ఇతర పార్టీలు కానీ ఓటర్ల జాబితా మీద దృష్టి పెట్టడాన్ని ఆహ్వానించాలి. పార్టీలు హడావుడి చేయడం, గంభీర ప్రసంగాలు తప్ప చిత్తశుద్ధితో ఇప్పటి వరకు ఓటర్ల జాబితాలో ఎక్కడెక్కడ చిన్న చిన్న పొరబాట్లు ఉన్నాయనే దానిపై దృష్టి పెట్టలేదు. అయితే కచ్చితంగా ఓటర్ల జాబితాలో కొన్ని తప్పిదాలున్నాయి. ఎన్నికల జాబితాలో పట్టణ ప్రాంతాల్లో 40% దాకా, గ్రామీణ ప్రాంతాల్లో 14% దాకా అవకతవకలున్నాయని 2000 సంవత్సరంలో మొట్టమొదట బయటపెట్టింది లోక్‌సత్తా. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ మొదలైన రాష్ట్రాల్లో జేపీ నేతృత్వంలో ఎంపిక చేసిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పూర్తిస్థాయి పరిశీలన చేసింది. చాలా శ్రమకోర్చి, సమయం కేటాయించి వందలాది వలంటీర్లు ఇందుకోసం పనిచేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గంలో ఓటర్ల లిస్టుతోపాటు, ఎన్నికలు పూర్తయ్యాక, ఓటువేసిన వారెవరో కూడా, ఆ టిక్కులు పెట్టిన జాబితా కూడా లోక్‌సత్తా ఫీజు చెల్లించి కొనుగోలుచేసి పోల్చిచూసింది. 40% దాకా ఓటరు జాబితా లోపాలు ఉంటే, ఓటింగ్‌లో ఆ సమస్య 2% లోపే ఉంది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో 14% దాకా లోపాలు జాబితాలో ఉన్నా, ఓటింగ్‌లో 0.5% దాకా మాత్రమే తేడా కనిపించింది. లోక్‌సత్తా చొరవతో అప్పటి ఈసీ ఎన్నికల జాబితాల ప్రక్షాళన 2003

**ఎన్నికల జాబితాల్లో అక్రమాలపై భారతదేశంలో నిర్దిష్ట పరిష్కారాలతో గొంతు విప్పి క్షేత్రస్థాయిలో పోరాడిన మొట్టమొదటి రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. ఓట్ ఇండియా కోసం 2000 సంవత్సరం ప్రాంతం నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో ఎంపిక చేసిన అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇంటింటి సర్వే నిర్వహించింది. పట్టణ ప్రాంతాల్లో 40%, గ్రామీణ నియోజకవర్గాల్లో 15% వరకు లోపాలున్నట్లు తేలింది. ఇది దేశాన్నే దిగ్భ్రాంతిపరచింది.**

ప్రాంతంలో చేపట్టింది. ఇప్పుడు పట్టణాల్లో 10% దాకా, గ్రామాల్లో 4-5% దాకా మాత్రమే ఓటరు జాబితా లోపాలు నమోదవుతున్నాయి. వీరిలో కూడా చనిపోయినవారు, వేరేచోటుకి తరలిపోయినవారు ... అలాంటి కేసులు ఎక్కువ. లోక్‌సత్తా లెక్కేసిన అవకతవకల్లో అలాంటి అనర్హులతో పాటు, అర్హులైన వారి పేరు జాబితాలో లేకపోవటాన్ని కూడా లెక్కేసింది. కాబట్టి ప్రింటింగ్ జాబితాలోని అనర్హులంతా పోలింగ్ బూత్‌లకి వచ్చి ఓటు వేస్తారనేది భ్రమ. పోలింగ్‌బూత్‌లో 2%, 0.5% కూడా అవకతవకలు లేకుండా '0'కి తీసుకురావాలి. అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి. అందుకోసం ప్రయత్నం చేయాలికానీ - మొత్తం ఓటర్ల జాబితా కుట్రమయం అనటం ప్రమాదకర రాజకీయ క్రీడ.

అయితే స్వతంత్ర వ్యవస్థగా వ్యవహరించాల్సిన ఈసీ తన పాత్రను సరిగా పోషించడం లేదనే విమర్శలు రాజకీయ పార్టీల నుంచి ఇటీవల తీవ్రస్థాయిలో వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంది. ఈసీ విశ్వసనీయతే ప్రమాదంలో పడితే ప్రజాస్వామ్యానికి అది వాంఛనీయం కాదు.

**ఈ ఏర్పాట్లు తప్పనిసరి**

➡ ఎన్నికల జాబితాలో అవకతవకల్ని పోస్టాఫీసులో నిరంతరం సవరించుకునే ఏర్పాటు, జనన, మరణ ధృవపత్రాల జారీతో అనుసంధానం వంటి మార్గాల్లో సక్రమ ఓటరు జాబితాలకు శాశ్వత ఏర్పాటు చేయాలన్న లోక్‌సత్తా సూచనను పాటించి ఉంటే ప్రస్తుత అపనమ్మకం వివాదం వచ్చేది కాదు. జాబితాల్లో ఓటింగ్ శాతంలో కొద్దిపాటి లోపాలు కూడా లేకుండా సరిచేయటం అవసరం. అందుకోసం పోస్టాఫీసులో నిరంతర సవరణల అవకాశం, నమోదు, తొలగింపు ఆటోమేటిక్‌గా జరిగే ఏర్పాటుతో

అనుసంధానం వంటి వాటి కోసం రాహుల్ గాంధీ సహా అన్ని పార్టీలూ కృషి చేయాలి.

➡ పోలింగ్ బూత్ లో ఐడీల తనిఖీకి పకడ్బందీ వ్యవస్థ ఉంటే, అరుదైన పొరపాట్లను కూడా నియంత్రించి నూరుశాతం అర్హులు మాత్రమే ఓటు వేసేలా చేయవచ్చు. రెండోసారి ఎవరు ఓటు వేయాలనుకున్నా, దొంగ ఓటు వేయాలనకున్నా సాధ్యం కాదు.

➡ విదేశీ వలసలు, ఇతరత్రా నేపథ్యంలో, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పౌరసత్వం సమస్య కూడా ఉంది. దక్షిణాలలో కొందరు రోహింగ్యాల సమస్య ఉండొచ్చుగానీ, మొత్తంగా పౌరసత్వ సమస్య తక్కువ.

➡ అదేవిధంగా, పౌరసత్వ సమస్యను వేరుగా చూడాలి. ఒకపక్క ఓటరు జాబితాల్లో అక్రమాలున్నాయంటూ, మరోపక్క ఎస్ఐఆర్‌ను ఎలా తప్పుబడతారు? ఎస్ఐఆర్‌కు ముందున్న ఓటర్ల ద్వారా బీజేపీ ఎన్డీఏ గెలవగలిగినప్పుడు ఎస్ఐఆర్ వల్ల ఓటర్ జాబితాలో మార్పులతో ఆ పార్టీలకు కూడా నష్ట ప్రమాదం ఉండదా?

➡ యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు నవీన్ చావ్లాను ఈసీగా నియమించటంపై దుమారం రేగినా, ఆయన అవినీతి పరుడు, కాంగ్రెస్ పార్టీకి సన్నిహితుడని సాక్షాత్తూ అప్పటి సీఈసీ రాష్ట్రపతికి తెలియజేసినా ఆ నియామకాన్ని కొనసాగించడమే కాకుండా నవీన్ చావ్లాను ఆ తర్వాత సీఈసీగా కూడా ప్రమోట్ చేశారు. అయితే ఆ స్థానంలో ఎవరున్నా ఎన్నికల ఫలితాల్ని తారుమారు చేయ లేరు కాబట్టి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుత ఎన్నికల సంఘాన్ని కూడా ఈ విషయం వర్తిస్తుంది. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సరిగా ఉంటే ఎన్నికలు సక్రమంగా జరుగుతాయిగానీ, ఢిల్లీలో కూర్చునే కొద్దిమంది ఎన్నికల అధికారులు ఒక పరిధిలో పరిధి దాటి చేయగలిగిందేమీ లేదు.

➡ గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 18 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని చర్చ జరిగింది. అదే విధంగా 2024లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో. కానీ, ఫారం 6 ద్వారా అప్లై చేసుకున్న అర్హులెవరికీ ఓటు నమోదు కాకుండా ఆగలేదు. లోక్‌సత్తా స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించింది.

➡ నిరంతర ఓటరు సవరణ ప్రక్రియకు పారదర్శక ఏర్పాటు చేయడం, పోలింగ్ బూత్ బయట ఓట్ల కొనుగోలు, ప్రలోభాలు, అభివృద్ధిని పణంగా పెట్టి తాత్కాలిక తాయిలాలు, కార్యకర్తల పేరుతో కిరాయి గుండాల్ని ఎన్నికల ఏజెంట్లుగా నియమించటం వంటివి లేకుండా ఎన్నికల సంస్కరణల కోసం అన్ని పార్టీలు కృషి చేయాలి.

2024 నోబెల్ గ్రహీతలు సూచించినట్లు వ్యక్తులకన్నా

కథిహార్ జిల్లా మణిహార్ ఎస్టీ నియోజకవర్గంలోని ఓ ఊళ్లో వర్షాలు, వరదలతో ఇళ్లన్నీ మునిగి పోయాయి. ఓటరు జాబితాలో పేరుకి అవసరమైన పత్రాల సంగతి అలా ఉంచి, వాళ్ళ వంట పొయ్యిలు కూడా మునిగి పోయాయి. ఆ ప్రాంతంలో రోడ్డు నుంచి ఇళ్లకు పడవలో ప్రయాణించి వివరాలు తెలుసుకున్నాక ఆ రిపోర్టర్ బీఎల్ఓ దగ్గరికి వెళ్లారు. ఆయన వరద కష్టాలు ఏకరువు పెట్టడంతోపాటు, ఇంకొంత సమయం ఉంటే అన్నీ పద్ధతి ప్రకారం పూర్తి చేస్తామని చెప్పారు. ఈ మొత్తం నిశితంగా చూశాక కొన్ని విషయాలు స్పష్టమయ్యాయి – అనర్హుల పేర్లు ఉన్నాయిగానీ, వారు వచ్చి ఓటు వేయలేరు. కొందరు అర్హుల పేర్లు లేవు. అదేవిధంగా, ఈసీ తక్కువ గడువును నిర్దేశించటం, వాతావరణం ప్రతికూలంగా ఉండటం, వీటిని అధిగమించి నమోదు చేయించుకునే అక్షర జ్ఞానం అక్కడ ప్రజల్లో అత్యధికులకు లేకపోవటం, మొబైల్‌ఫోన్లున్నా తగిన డిజిటల్ పరిజ్ఞానం కొరవడటం మొదలైన సమస్యలు కనిపించాయి. బంగ్లా దేశీయులు, నేపాల్ వారి పౌరసత్వ సమస్య కచ్చితంగా ఉంది. అదే విధంగా, ఓటు విలువ తెలిసి, ఓటరు జాబితాలో పేరు కోసం ఆరాటం ఆరాటపడటం కన్నా – ఓటు కూడా లేకపోతే రాజకీయ నాయకులు తమను పట్టించుకోరు, తమకు రావాల్సిన సంక్షేమ పథకాలు అందవన్న ఆందోళన ఎక్కువగా కనిపించింది.

వ్యవస్థల నిర్మాణానికి, ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయాల్సిన పనులకి, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యానికి కృషి చేయటం, ఇందుకోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించటం, ప్రజల్ని సమీకరించటం ప్రతిపక్షాల ఎజెండా కావాలి. బీహార్ 'సర్'లో కూడా అవిద్య ఉన్నచోట సమస్య ఎక్కువగా ఉంది. సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు – ఈసీ తక్కువ సమయంలో ఈ ప్రక్షాళన చేయాలనుకోవటం, వానలు, వరదలు సమస్యను పెంచాయి. ఈసీ పొరపాట్లని ఎత్తి చూపుతూ వాటిలోని లోపాలను సరిదిద్ది ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టం చేసే దిశగా అన్ని పార్టీల వ్యవహార శైలి ఉండాలి. ప్రతీ అంశాన్నీ రాజకీయం చేయడం కాకుండా ఓటర్ల జాబితా ప్రక్షాళనకు తోడ్పాటును అందించాలి. రాజకీయ సంస్కృతిలో మార్పు రావాలి...అందరికీ మంచి చదువు అందించటంపై పార్టీలు, ప్రభుత్వాలు దృష్టి సారించాలి. అదేవిధంగా జీరో హౌస్ నంబర్, డబుల్ ఎపిక్ నంబర్లు వంటి అంశాలపై హేతుబద్ధ స్పష్టత ఇచ్చినట్లు, ఎప్పటికప్పుడు ఈసీ పారదర్శకతతో ప్రజలకు వాస్తవాల్ని తెలియచేస్తుండాలి.

★

# ఫ్యామిలీ డాక్టర్, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థపై
## కార్పొరేట్ వైద్యుల మాటలైనా వినపడుతున్నాయా? పీఎం, సీఎంలూ?

**దేశంలో ఇటీవలి సగటు ఆహార ద్రవ్యోల్బణం -0.99% (సీఎఫ్‌పీఐ)**

| | |
|---|---|
| **వినియోగ ధరల సూచి (సీపీఐ)** | **- 2.82%** |
| **విద్యా ద్రవ్యోల్బణం** | **- 4.12%** |
| **వైద్య సేవల ద్రవ్యోల్బణం** | **- 13-14%** |

**వివిధ సంక్షేమ పథకాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో లబ్దిదారుల కుటుంబాలకు అందుతున్న నెలవారీ సగటు మొత్తం - సుమారు రూ.10,000/-**

**ప్రభుత్వ ఆరోగ్య విధానం అధ్వాన్నంగా, తలకిందులుగా ఉండటం వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నష్టపోతున్న పనిదినాలు - కొన్నింటిలో ఎన్ని లక్షలో ఏఐ కూడా చెప్పలేకపోతోంది.**

**ఆరోగ్య సమస్యల వల్ల ఉత్పాదక శక్తిలో నష్టం - వేల కోట్ల రూపాయలు**

**అనారోగ్యం వస్తే వ్యక్తిగతంగా జేబులో నుంచి చేసే వ్యయం ఆరోగ్య ఖర్చుల్లో ...**

| | |
|---|---|
| **ఆంధ్రప్రదేశ్‌లో** | **58.8%** |
| **తెలంగాణ** | **40%** |
| **భారత్** | **45%** |
| **ప్రపంచ సగటు** | **18%** |

**కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల పేదలవుతున్నవారు**

| | |
|---|---|
| **భారతదేశ వ్యాప్తంగా** | **5.5 కోట్లు** |
| **ఆంధ్రప్రదేశ్** | **26 లక్షలు** |
| **తెలంగాణ** | **20 లక్షలు** |

- ఈ గణాంకాల సరళి సుస్పష్టం. ఎన్ని సంక్షేమ పథకాలనిచ్చినా సరైన ఆరోగ్య విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయకుంటే, వైద్య ఖర్చులు అధిక శాతం ప్రజల ఆదాయాల్ని, జీవితాల్నీ కొల్లగొడతాయి. ఒక పరిధి దాటి సంక్షేమ పథకాల్ని పెంచితే రాష్ట్రాలు, దేశం దివాళా తీయటం ఖాయం. కానీ సంక్షేమ పథకాలు ఒకస్థాయితో ఆగినా, వైద్య ద్రవ్యోల్బణం పైపైకి పరుగులు పెడుతూనే ఉంటుంది. ఒక పరిధి దాటి ఏఐ వంటి ఆధునిక సాంకేతికత కూడా ఈ సమస్యను పరిష్కరించలేదు కాబట్టి - అనారోగ్య భారతం దేశ ఉత్పాదక శక్తికి, ఆర్థికాభివృద్ధికి, కుటుంబాలు, వ్యక్తుల సుఖశాంతులకు దెబ్బకొట్టే ప్రమాదం ఉంది.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని



ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి కూడా హాజరయ్యారు. పలు గిన్నిస్ రికార్డులు నమోదయ్యాయి. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంగతి అలా ఉంచితే, ప్రజారోగ్యం కోసం ఓ బృహత్ కార్యక్రమం నిర్వహించిన బిల్డప్ ఇచ్చారు. యోగా భారతదేశంలో 5,000 ఏళ్లకు పూర్వమే ఆవిర్భవించిన దాఖలాలున్నాయి. కానీ 1950ల వరకు మన ప్రజల సగటు జీవితకాలం కేవలం 30-40 ఏళ్లే. శాస్త్ర సాంకేతికతలతో వైద్య రంగం పురోగమించాక, ఇప్పుడు 70 ఏళ్లు దాటింది. పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన, తూకం వేసిన పౌష్టికతలతో ఆహారం, యోగా వంటివాటివల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందనటంలో సందేహం లేదు. కానీ వాటివల్లే ఆరోగ్యం బాగుండి, పూర్ణాయుషు కలుగుతుందంటే - ముఖ్యమంత్రులకు, ప్రధానమంత్రికి వ్యక్తిగత వైద్య నిపుణులు ఎందుకున్నారు? మిగతా ప్రజలకు అలా వ్యక్తిగత నేపథ్యం, రోగచరిత్ర తెలిసిన ఫ్యామిలీ డాక్టర్ అక్కర్లేదా? రోగ లక్షణాల్ని బట్టి పరీక్షల్ని, సూచించి, ఔషధాలను సిఫార్సు చేసే - కృత్రిమ మేధ వైద్యం తక్షణ ఫలితాల నివ్వొచ్చుగానీ - నిలకడగా, నిర్ణీత కాలవ్యవధిలో రోగితో సంప్రదింపులు చేస్తూ, రోగి అభిప్రాయాలకు విలువనిస్తూ (ఎవరి శరీరానికి వారే మొదటి అత్యుత్తమ డాక్టర్ అని నిపుణులు చెబుతారు) రోగ మూలాల్ని నిర్మూలించే సమగ్ర వైద్యానికి డాక్టర్ల అందుబాటు తప్పనిసరి. అలా డాక్టర్ పర్యవేక్షణలో సాంకేతికత వినియోగంతో చిట్టచివరి పౌరునికి కూడా జేబులో డబ్బుతో సంబంధం లేకుండా నాణ్యమైన వైద్యం అందుబాటు లోకి తేవటం ప్రభుత్వ బాధ్యత. ప్రభుత్వ ఆరోగ్య విధానం సక్రమంగా లేకపోవటం వల్ల డాక్టర్లు - రోగుల మధ్య సమాచార అంతరం పెరుగుతూ, ప్రజలు నష్టపోతున్నారు, డాక్టర్లకూ చికాకులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, డాక్టర్లు




ప్రజలు కూడా సరైన వైద్య ఆరోగ్య విధానం కోసం ఆచరణసాధ్యంగా కృషి చేయాల్సి ఉంది.

భారతదేశంలో ప్రభుత్వ వైద్యమంటే ఆస్పత్రి చికిత్సే అనే అభిప్రాయం పాతుకుపోయింది. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటివి దీన్నుంచే రూపుదిద్దుకున్నాయి. మధ్యలో ముఖ్యమంత్రులు తమ సొంత డబ్బేదో దానం చేస్తున్నట్లు, కొన్ని ఆపరేషన్లకి బిల్లులు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా చెల్లించి ప్రచారం చేసుకుంటున్నారు. దీనివల్ల వైద్య ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతూ, ప్రభుత్వ ఖజానా డబ్బు ఆవిరవటం, ప్రజలకు అనారోగ్యం కొనసాగుతుండటం తప్ప – ఉత్పాదకతను పెంచే స్థాయి పూర్తి స్వస్థత మిధ్యగానే మిగిలిపోతుంది. మరేమిటి పరిష్కారం?

దీనికి జాతీయ వైద్యుల దినోత్సవం రోజున ఇద్దరు ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు వెలిబుచ్చిన అభిప్రాయాలు మౌలిక పరిష్కారం చూపుతాయి. ప్రభుత్వాలకు కళ్లు, చెవులు ఉంటే – ఆరోగ్య విధానంలో అసలైన మార్పు ఎక్కడనుంచి ప్రారంభించాలో తెలియజెప్తాయి. రెండు ప్రముఖ పత్రికల్లో ప్రచురితమైన ఆ ఇద్దరు వైద్యుల అభిప్రాయాల్లోని కొన్ని కీలకాంశాలు:

**డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఏఐజీ హాస్పటల్స్, హైదరాబాద్**



ఒకప్పుడు కుటుంబమంతా ఫ్యామిలీ డాక్టర్ దగ్గరే చికిత్స తీసుకునేవారు. వైద్యుడిని దేవుడిగా భావించేవారు. చెప్పినట్లు నడుచుకునేవారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానం కనుమరుగైంది. ఇదీ వైద్యుల పట్ల నమ్మకం సడలటానికి కారణమవుతోంది.

అప్పట్లో ఫ్యామిలీ డాక్టరో, తెలిసిన జనరల్ ఫిజీషియనో సూచిస్తేనే నిపుణుల దగ్గరకు వెళ్లేవారు. వారికి మంచి డాక్టర్ ఎవరో తెలిసి ఉండేది. రోగులు కూడా వారినే సంప్రదించేవారు. ఇప్పుడు ప్రజలు ఏ సమస్య వచ్చినా, నేరుగా నిపుణుల వద్దకే వెళ్తున్నారు. వెంటనే ఆయన పెద్ద పరీక్షలు చేయాలని చెబితే, అనుమాన దృష్టితోనే చూస్తున్నారు. రోగి, డాక్టర్ మధ్య నమ్మకం, గౌరవం ఏర్పడటం లేదు.

**డాక్టర్ పి.రఘురాం, సంస్థాపక డైరెక్టర్, కిమ్స్**



ప్రస్తుతం మనదేశంలో సమర్థవంతమైన ఆరోగ్య సేవలు కీలకంగా అవసరమైనప్పటికీ, ఎంతో నిర్లక్ష్యానికి గురవుతున్న 'ఫ్యామిలీ మెడిసిన్' గురించి నా ఆలోచనలు పంచుకోవాలనుకుంటున్నాను. ఒకానొక కాలంలో కుటుంబంతో ఎవరికీ ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా మొదట 'ఫ్యామిలీ డాక్టర్' దగ్గరకే వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఆ 'ఫ్యామిలీ డాక్టర్' అనే భావన క్రమక్రమంగా అదృశ్యమవుతున్నది. దాంతో రోగులు చిన్నపాటి సమస్యలకు కూడా నేరుగా ఆస్పత్రులకే పరుగులు పెడుతున్నారు. తద్వారా ఇప్పటికీ రోగులతో నిండిపోయిన ఆస్పత్రులపై మరింత భారం పడుతున్నది. అనేక అభివృద్ధి చెందిన దేశాలలో ఫ్యామిలీ మెడిసిన్‌ను ఒక ప్రత్యేకమైన వైద్యశాఖగా పరిగణిస్తారు. అక్కడ ప్రత్యేకమైన పోస్టు గ్రాడ్యుయేట్ రెసిడెన్సీ ప్రోగ్రాం ద్వారా ఇందులో శిక్షణనూ అందిస్తున్నారు. భారతదేశంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నాణ్యమైన ప్రాథమిక వైద్యసేవలను ప్రోత్సహించడంతో పాటు, ఫ్యామిలీ మెడిసిన్‌ను ఒక ప్రత్యేక స్పెషాలిటీగా అభివృద్ధి చేయాలన్న దిశగా కృషి చేస్తోంది. అయితే ఇప్పటికీ ఫ్యామిలీ మెడిసిన్‌ను ఎంబీబీఎస్ స్థాయిలో అండర్ గ్రాడ్యుయేట్ శిక్షణలో భాగంగా చేర్చలేకపోయింది. భారతదేశంలో ఫ్యామిలీ మెడిసిన్‌లో మొట్టమొదటి పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు 2011లో కేరళ రాష్ట్రం, కోజికోడ్ లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రారంభమైంది. అయితే ఇప్పుడు 2025లోకి వచ్చేసరికి, దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది ఫ్యామిలీ మెడిసిన్‌లో పీజీ స్థాయిలో అందుబాటులో ఉన్న సీట్లు 150 కంటే తక్కువ. 140 కోట్ల జనాభా ఉన్నదేశంలో ఇది ఆశ్చర్యపరిచే సంఖ్య! మరోవైపు, ఫ్యామిలీ మెడిసిన్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులకి దరఖాస్తు చేసేవాళ్ల సంఖ్య తక్కువగా ఉంటున్నది. భారతదేశ జనాభాలో 70 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నప్పటికీ, వైద్యులలో 25 శాతం కంటే తక్కువమంది మాత్రమే ఈ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. మెట్రో ప్రాంతాల వెలుపల ఒక్కో ఫ్యామిలీ డాక్టర్‌కూ సగటున 7,500 మంది రోగులు ఉండగా, అత్యంత దుర్భర ప్రాంతాలలో ఈ నిష్పత్తి సగటున ఒక్కో ఫ్యామిలీ డాక్టర్‌కి 25,000 మందికి పడిపోతున్నది. ఇలా

ఫ్యామిలీ డాక్టర్ల కొరత భారతదేశ ఆర్థిక వ్యవస్థలోని అతి ముఖ్యమైన లోటుగా తయారైంది. దీనికి పరిష్కారంగా ఈ **అయిదు పాయింట్ల ఎజెండాపై పాలకులు, విధాన నిర్ణేతలు దృష్టి పెట్టాలి.**

**1.'ఫ్యామిలీ మెడిసిన్'ను అండర్ గ్రాడ్యుయేట్ (ఎంబీబీఎస్) పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారతదేశం అంతటా ప్రతి వైద్య కళాశాలలో ఫ్యామిలీ మెడిసిన్ కోసం విభాగాలను ఏర్పాటు చేయాలి.**

**2. భారతదేశానికి స్పెషలిస్టు వైద్యుల అవసరం ఉన్నదనే విషయంలో అనుమానం లేదు. కానీ, ఫ్యామిలీ డాక్టర్ల సంఖ్యను పెంచటం అంతకన్నా ముఖ్యం. ఫ్యామిలీ డాక్టర్ల శిక్షణపై మన దేశం పెట్టుబడులు పెంచాలి. అదే సమయంలో, ఎంబీబీఎస్ కోర్సులో చేరిన యువ విద్యార్థులకు ఫ్యామిలీ మెడిసిన్ భావనపై అవగాహన కలిగిస్తూ, దీనిపై ప్రజాదరణ పెంచాలి.**

**3. భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సదుపాయాల నిర్మాణాన్ని బలోపేతం చేయాలి. అప్పుడే స్థానికంగా ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా నాణ్యమైన విద్యా సేవలు రోగులకు అందుతాయి. దీంతోపాటు, పరీక్షలు చేయించుకోవడం లేదా చికిత్స పొందటానికి ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది.**

**4. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో స్మార్ట్ ఫోన్ల ద్వారా, ఇతరత్రా సాంకేతిక పురోగతులను తీసుకురావాలి.**

**5. బ్రిటన్‌లో ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) మోడల్‌ను మనం భారతదేశం లోనూ అనుసరించవచ్చు. భారత్‌లో ఎక్కువ శాతం ఆరోగ్య సేవలు ప్రయివేటు రంగం ద్వారానే అందుతున్నాయి. కనుక, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేయటంలో ప్రయివేటు రంగాన్ని భాగస్వామిగా తీసుకోవడానికి ఇక్కడ అనుకూలమైన పరిస్థితి ఉన్నది.**

భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకుని 75 సంవత్సరాలు పూర్తిచేసుకుని మూడేళ్లు గడిచాయి. అమృతకాలంలోకి అడుగు పెట్టిన సందర్భంగా, 2047 నాటికి, అంటే, స్వాతంత్ర్యపు 100వ సంవత్సరం నాటికైనా 'ఫ్యామిలీ డాక్టర్' భావనను బలమైనది, ప్రభావవంతమైనదిగా మార్చాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకొని, ఆ దిశగా స్ఫూర్తిదాయకమైన, అమలు చేయగలిగే, స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకు ఇదే తగిన సమయం. వైద్యనీతిని, ఆచరణలో నిర్దేశించే గ్రీకుల కాలం నాటి హిపోక్రటిక్ ప్రతిజ్ఞలో కీలకమైన అంశం "రోగికి మేలు చేకూర్చటమే వైద్యుడి అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలి" అన్నది. ఈ మార్గదర్శక నియమాన్ని చిత్తశుద్ధితో పాటించినప్పుడే

> ***స్వాతంత్ర్యపు 100వ సంవత్సరం నాటికైనా 'ఫ్యామిలీ డాక్టర్' భావనను బలమైనది, ప్రభావవంతమైనదిగా మార్చాలన్న లక్ష్యాన్ని ముందు పెట్టుకొని, ఆ దిశగా స్ఫూర్తిదా యక మైన, అమలు చేయగలిగే, స్పష్టమైన చర్యలు తీసుకోవాలి.అందుకు ఇదే తగిన సమయం.***

భారతదేశ ఆరోగ్య విధానాన్ని సమర్థంగా పునర్నిర్మించుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.

– ఈ ఇద్దరు డాక్టర్లు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రికి వ్యక్తిగతంగా కూడా తెలిసినవారు. ప్రయివేటు రంగ భాగస్వామ్య పరిమితులను గుర్తించి, ప్రతి గ్రామంలో కాకుండా ... వైద్యులు రావడానికి సుముఖత చూపేలా గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి ఫ్యామిలీ డాక్టర్ల బృందంతో ప్రాథమిక వైద్య సెంటర్లుగా అభివృద్ధి చేసి, డాక్టర్ల మధ్య పోటీ, ప్రజలకు నమ్మకం ఉన్న డాక్టర్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఇచ్చేలా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రూపొందించిన నమూనాను అనుసరించడం మేలు. 2017లో జాతీయ డాక్టర్ల దినోత్సవం థీమ్ కూడా 'ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ ఏర్పాటు'. ఇప్పటికీ సాకారం కాలేదు. భారతదేశం అందరికీ అందుబాటులో, జేబు ఖర్చు లేని, నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించడం అవసరం. ఇది ఆచరణ సాధ్యంగా, ప్రభుత్వ ఖజానాపై తక్కువ భారంతో అమలవ్వాలంటే ప్రాథమిక స్థాయిలో నివారణ, నియంత్రణ కీలకం. ఇప్పుడున్న ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ విఫలమైందని దశాబ్దాల క్రితమే రుజువైంది. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో కూడిన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను తీసుకు రావడం సరైన మార్గం. అయితే 2047 దాకా ఈ లక్ష్యాన్ని వాయిదా వేస్తే, అభివృద్ధి చెందిన దేశంగా మారాలని లక్ష్యాన్ని, అందుకున్న అవకాశాల్ని భారత్ మరోమారు చేజార్చుకున్నట్లు అవుతుంది. కాబట్టి ఎఫ్డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన ఫ్యామిలీ డాక్టర్ ఆధారిత ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో కూడిన ఆరోగ్య విధానాన్ని చర్చించి, మొక్కుబడిగా కాకుండా – చిత్తశుద్ధితో అమలుచేయడం తక్షణావసరం.

★

# ఐజేయూ సెక్రటరీ జనరల్ గా డి.సోమసుందర్ ఏకగ్రీవ ఎన్నిక!



సోమసుందర్



బల్విందర్ సింగ్ జమ్మూ

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) సెక్రటరీ జనరల్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి. సోమ సుందర్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. దేశంలోని 27 రాష్ట్రాలలో దాదాపు ముప్పై వేల మంది సభ్యులుగా కలిగి , అతి పెద్ద జర్నలిస్ట్ యూనియన్‌గా గుర్తింపు పొందిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ద్వైవార్షిక ఎన్నికల ప్రక్రియ 2025 జూన్‌లో ప్రారంభం అయ్యింది.

బీహారు రాష్ట్ర రాజధాని పట్నాలోని ఆర్యభట్ట విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఐ.జే.యు. సెంట్రల్ రిటర్నింగ్ అధికారి మహేష్ కుమార్ సిన్హాకు డి.సోమ సుందర్ తన నామినేషన్ పత్రాలను ఆగస్ట్ 11 వ తేదీన దాఖలు చేశారు. సోమసుందర్ నామినేషన్ ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన ఏపీయూ డబ్ల్యూజే, టి.యు.డబ్ల్యూ.జే. తో పాటు 17 రాష్ట్రాలకు చెందిన వర్కింగ్ జర్నలిస్టు యూనియన్లు బలపర్చాయి.

ప్రస్తుతం సంస్థ సెక్రటరీ జనరల్ గా కొనసాగుతున్న పంజాబ్ చండీగఢ్ జర్నలిస్ట్ యూనియన్‌కు చెందిన బల్విందర్ సింగ్ జమ్మూ ఐ.జే.యు. అధ్యక్షునిగా ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. యూనియన్ లోని ప్రధానమైన రెండు పదవులకు ఒకొక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యింది. దాంతో వీరిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సెంట్రల్ రిటర్నింగ్ అధికారి మహేష్ కుమార్ సిన్హా ఆగస్ట్ 18న పట్నాలో ప్రకటించారు.

సోమసుందర్ కళాశాల విద్యార్థిగా ఉంటూనే 1976 ఏప్రిల్‌లో "విశాలాంధ్ర" దినపత్రికకు తాడేపల్లిగూడెం పట్టణ విలేకరిగా చేరారు. "విశాలాంధ్ర" దినపత్రికలో మూడు దశాబ్దాల పాటు పనిచేశారు.

ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ ప్రచురిస్తున్న "జనబలం" మాసపత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గా 2005 నుండి కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు నిర్వహిం చారు. ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గవర్నింగ్ కౌన్సిల్‌లో రెండుసార్లు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లిటరసీ మిషన్ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఒకసారి సభ్యునిగా నియ మితులై సేవలు అందించారు.

పంజాబ్ ట్రిబ్యూన్ స్టేట్ బ్యూరోలో సీనియర్ పాత్రికే యునిగా మూడు దశాబ్దాలుగా పనిచేసిన బల్విందర్ సింగ్ జమ్మూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా సేవలు అందించారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా లోక్‌సత్తా సమన్వయకర్తగా ప్రశాంత్

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్తగా ప్రముఖ సామాజిక కార్యకర్త సుంకరి ప్రశాంత్ కుమార్‌ను నియమించినట్టు లోక్‌సత్తా ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, తెలంగాణ రాష్ట్ర ప్రధాన సలహాదారు పర్చా కోదండరామారావు ప్రకటించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కార్యకలాపాలను ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రశాంత్‌కుమార్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. జ్వాల స్వచ్ఛంద సంస్థ ద్వారా అవినీతి వ్యతిరేక ఉద్యమాల్లో ప్రశాంత్‌కుమార్ చురుగ్గా పాల్గొన్నారని వారు తెలిపారు.

# నిమిష ప్రియ కేసు భారత్‌కి ఓ పాఠం

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

ఒక వ్యక్తి బాధ, వేదన పట్ల మనుషులుగా మనం సహానుభూతిని ప్రదర్శిస్తాం. 24 గంటల టెలివిజన్, సోషల్ మీడియా యుగంలో మానవీయ కథనాలు, కోట్లాది ప్రజల మానసిక ఉద్వేగాలను ప్రభావితం చేస్తాయి. పెద్ద ఎత్తున చర్చను రేకెత్తిస్తాయి. రకరకాల వాదనలకు తెరతీస్తాయి. అటువంటి సందర్భాలు జాగ్రత్తగా సమీక్షించుకోవడానికి, మెరుగైన భవిష్యత్ పాఠాలు నేర్చుకోవడానికి మనకు అవకాశాన్నిస్తాయి. మన ఉమ్మడి సామాజిక జీవితాన్ని సంస్కరించు కోవటానికి తోడ్పడతాయి. హింసా సంక్షుభిత యెమన్‌లో నిమిష ప్రియ విచారణ, శిక్ష అటువంటి ఒక కేసు.

చాలామంది భారతీయుల హృదయాల్ని కదిలించిన ఉదంతమిది. చమురు సంపదతో విరాజిల్లే అరబ్ ప్రపంచంలో మెరుగైన జీవితం కోసం ఒక్క అవకాశం లభించకపోతుందా అని అర్రులు చాచే పదుల లక్షల మంది భారతీయుల్లో ఆమె ఒకరు. నిమిష ప్రియ చెప్పిన ప్రకారం వ్యాపార భాగస్వామి ఆమె డబ్బు దొంగి లించాడు. భౌతికంగా బెదిరించాడు. ఆమెని కట్టడి చేయడానికి పాస్‌పోర్టు, పత్రాలను స్వాధీనం చేసు కున్నాడు. నిమిష పోలీసు ఫిర్యాదు ఇచ్చినా ఫలితం లేకపోయింది. తన పాస్‌పోర్టును, ఇతర పత్రాలను తిరిగి తీసుకోవడానికి వ్యాపార భాగస్వామికి ఆమె కెటామైన్ మత్తుమందు ఇచ్చారు. అయితే అనుకోకుండా ఆ డ్రగ్ మోతాదు ఎక్కువై అతను చనిపోయాడు. దేశం నుండి పారిపోతుండగా నిమిషను అరెస్ట్ చేశారు. ఆమెపై విచారణ జరిపి, హత్యానేరం కింద 2018లో మరణ శిక్ష విధించారు. సదరు విచారణ మొత్తం అరబిక్‌లో జరిగింది. నిందితురాలు తన వాదన వినిపించుకుని, రక్షించుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఆమె తరపున న్యాయప్రతినిధి లేరు. కనీసం నిమిష వాదనను అరబిక్‌లోకి తర్జుమా చేసే అవకాశం కూడా లభించలేదు.

తిరిగి విచారణకు నిమిష, ఆమె మద్దతుదారులు అభ్యర్థించారు. ఆమెను అల్‌బైదా జైలు నుంచి రాజధాని సనా నగరానికి తీసుకువెళ్లారు. ఇంకొక ట్రయల్ కోర్టులో మళ్ళీ విచారణ జరిపారు. 2020లో జరిపిన పునర్విచారణలో కూడా శిక్ష ఖరారైంది. ఉరిశిక్ష విధించారు. 2023లో యెమెన్ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ నిమిష అప్పీల్‌ను తిరస్కరించింది. అంతర్జాతీయ సమాజం గుర్తించిన యెమెన్ అధ్యక్షుడు రషీద్ మహమ్మద్ అల్-



అలిమి ఆమెకు మరణశిక్షను ధ్రువీకరించారు. ఉరిశిక్ష అమలుకు అనుమతించారు.

జులై మొదటి వారంలో అమలవ్వాల్సిన ఆమె మరణ శిక్ష వాయిదా పడింది. బహుశా భారత ప్రభుత్వ, మానవ హక్కుల బృందాల ఒత్తిడి వల్ల కావచ్చు.

**ఇప్పుడు నిమిష కేసును విశ్లేషణాత్మకంగా చూద్దాం**

మొదటిది, కొన్ని మానవ హక్కుల బృందాలు మరణశిక్షను సూత్రప్రాయంగా వ్యతిరేకించేందుకు ఈ కేసును వేదికగా ఉపయోగిస్తున్నాయి. అయితే ఇది అందుకు ఏ రకంగానూ ఉపయోగపడదు. ఐరోపా బైట చాలా దేశాలు, అమెరికా, భారత్ సహా మరణశిక్షను అమలు చేస్తున్నాయి. కన్నుకు కన్ను అనే ఆటవిక ప్రతీకార సిద్ధాంతాన్ని అమలుచేయటం సాధారణమైన ఏ ఇస్లామిక్ దేశంలోనైనా మరణశిక్షకు వ్యతిరేకంగా వాదనలు వృథా.

రెండోది, ఒక సుదీర్ఘమైన న్యాయ ప్రక్రియ నిమిషకు శిక్ష విధించాక – క్షమాభిక్ష లేదా శిక్ష తగ్గించడం అనే రెండే ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నట్టు కనిపిస్తుంది. అధ్యక్షుడైనా ఆమెను క్షమించాలి, లేదా బాధితుడి కుటుంబం 'ఖిసాస్' అంటే, ప్రతీకారానికి బదులు ఆర్థిక పరిహారాన్నిచ్చే 'దియా' దరఖాస్తుకి అంగీకరించాలి.

మూడోది, యెమెన్‌కి ఎవరు సారథ్యం వహిస్తున్నారో కూడా

మనకు స్పష్టంగా తెలియదు. దీంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. నిమిష జైలు శిక్ష అనుభ విస్తున్న యెమెన్ రాజధాని సనా – హూతీ సాయుధదళాల నియంత్రణలో ఉంది. దేశంలోని వివిధ భాగాలకు రకరకాల బృందాలు, ముఠాలు నాయకత్వం వహిస్తూ, ఒక సంక్లిష్ట అంతర్యుద్ధంలో కూరుకుపోయివుంది. భారత్‌కి, చాలా ప్రపంచ దేశాలకి హూతీలతో దౌత్య సంబంధాలు లేవు. ఉన్నంతలో కాస్త నియంత్రణ కలిగిన అల్–అలిమి మరణశిక్షను సూత్రప్రాయంగా ఖరారు చేశారు. హూతీలపై ఇరాక్‌కి పట్టు ఉంది. అయితే ఈ ప్రాంతంలోని పరిస్థితి సంక్లిష్టత దృష్ట్యా, నిమిష తరఫున ఆ దేశం ఎంతవరకు జోక్యం చేసుకోగలదో చెప్పలేం.

నాలుగోది, భారత ప్రభుత్వం తాను చేయగలిగినదంతా చేసింది. ఇదే మాట అటార్నీ జనరల్ సుప్రీంకోర్టుకూ నివేదించారు. బహుశా ఇరాన్ జోక్యానికి తదుపరి ప్రయత్నాలు జరగొచ్చు. కానీ మనం ఒక విషయం గుర్తించాలి. నేర న్యాయ వ్యవహారాల్లో ఏ విదేశీ ప్రభుత్వ మైనా ఇంకో దేశాన్ని ప్రభావితం చేయటం కష్టం. అందు లోనూ, ఆ దేశం అంతర్యుద్ధ సంక్షోభంలో ఉన్నప్పుడు జోక్యం ఉన్నకొద్దీ సంక్లిష్టమవుతుంది. ఎవరికి ఎక్కడ ఆధిపత్యం ఉందో ఎవరికి కచ్చితంగా తెలియని పరిస్థితి. స్థానికంగా నియంత్రణ కలిగిన ముఠాతో మనకు దౌత్య సంబంధం లేనప్పుడు పరిణామాలు అగమ్యంగా మారు తాయి.

ఐదవది, చట్టబద్ధ పాలన సక్రమంగా లేని దేశాల్లో లక్షలాది భారతీయులు నివసిస్తున్నారు. హక్కుల్ని తేలిగ్గా కాలరాసే న్యాయ వ్యవస్థలో పారదర్శకత కొరవడే, శిక్షలు అసంబద్ధ కఠినరీతిలో ఉండే అలాంటి దేశాల్లో ఆర్థిక అవకాశం కోసం వెళ్లాలనుకునే భారతీయులకు తగిన సమాచారం, సలహా సూచనల్ని అధికారికంగా అందించాలి. ఇందుకోసం ఒక వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

ప్రవాస భారతీయులు మన దేశానికి అపార తోడ్పాటును అందిస్తున్నారు. భారీ మొత్తాల్ని పంపుతున్నారు. (2024–25లో 135 బిలియన్ డాలర్లు). అవగాహన లేమితో వారు స్థానిక పరిస్థితులకు బాధితులు కాకుండా నివారించేందుకు మనం తగిన సహాయ సహకారాల్ని

**చట్టబద్ధ పాలన సక్రమంగా లేని దేశాల్లో లక్షలాది భారతీయులు నివసిస్తున్నారు. హక్కుల్ని తేలిగ్గా కాలరాసే న్యాయ వ్యవస్థలో పారదర్శకత కొరవడే, శిక్షలు అసంబద్ధ కఠినరీతిలో ఉండే అలాంటి దేశాల్లో ఆర్థిక అవకాశం కోసం వెళ్లాలనుకునే భారతీయులకు తగిన సమాచారం, సలహా సూచనల్ని అధికారికంగా అందించాలి. ఇందుకోసం ఒక వ్యవస్థను ఏర్పాటుచేయాలి.**

అందించాలి. ఆయా దేశాల్లోని పరిస్థితుల గురించి ముందుగానే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. పాస్‌పోర్టుల స్వాధీనం, వెట్టిచాకిరీ వంటి సందర్భాల్లో మద్దతును అందించడం కీలకం. ఒక భయంకర విషాదం తర్వాత స్పందించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అది కష్టం కూడా. చివరిగా, మన దేశంలోని చట్టబద్ధపాలన దుస్థితి మీద కూడా దృష్టి సారించాలి. మనకు చట్టబద్ధ పాలన మొక్కుబడిగా అమలవుతోంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉందిగానీ, అందులో తీవ్ర సంక్షోభం ఉంది. 5.2 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటిలో చాలామేర సంవత్సరాలు తరబడి కొనసాగుతున్నాయి.

మూడింట రెండొంతులు క్రిమినల్ కేసులు. 10–15% క్రిమినల్ కేసుల్లోనే శిక్ష పడుతోంది. వారిని కూడా తరచుగా థర్డ్ డిగ్రీ పద్ధతుల ద్వారా హింసించి ఒప్పిస్తున్నారు. జైళ్లలో ఉన్నవారిలో 70% విచారణలో ఉన్న ఖైదీలే. కోర్టు బయట సెటిల్‌మెంట్లు సాధా రణమైపోయాయి.

ఉన్నకొద్దీ ... బడితె ఉన్నవాడిదే బర్రె అవుతోంది. మన సామాజిక స్థిరత్వం, ఆర్థిక అభివృద్ధికి సైతం మన చట్టబద్ధపాలన వ్యవస్థలను సంస్కరించడం తప్పనిసరి అవసరం. ఇందుకోసం ఈ దేశం భారీ ఎత్తున సంఘటిత ప్రయత్నం చేయాలి. మన భావోద్వేగాలను తాకే ఒక కేసుపై స్పందించడం తేలిక. కానీ ప్రతి పెండింగ్ కేసు, న్యాయ వైఫల్యం వెనుకా అనేకమంది కన్నీరు, బాధామయ గాథలు దాగి ఉంటాయి. పోలీస్, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, విచారణ పద్ధతులు, ట్రయల్ కోర్టులు, రాజ్యాంగ కోర్టులను సంస్కరించటం మన అత్యంత ప్రాధాన్యాంశం కావాలి.

★

## సురవరం సుధాకరరెడ్డి కి జేపీ ఘననివాళి

మన సమాజంలోని అత్యున్నత ప్రమాణాలకు సురవరం సుధాకరరెడ్డి నిదర్శనమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్ డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు. సీపీఐ అగ్రనేత సురవరం ప్రజల పట్ల ప్రేమ, నిజాయతీ, నిబద్ధత గల నేతన్నారు. విశ్వాసాలు, భావజాలాలు ఏవైనా.. అటువంటి నేతలను అనుసరించి మనం నాగరిక ప్రమాణాల్ని, హేతుబద్ధ చర్చని, సామరస్యతను పెంపొందించుకోవాలన్నారు. సురవరం మృతి మన ప్రజాజీవనానికి పెద్ద లోటు అని ప్రగాఢ సంతాపం తెలిపారు.

# ఏపీ పరీక్షల విభాగంలో 1969 తర్వాత కీలక మార్పులు..జిల్లాకో బోర్డు

జిల్లాకో పరీక్షల బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న సీసీఈబీల స్థానంలో వీటిని నెలకొల్పుతారు. జిల్లా విద్యాధికారి చైర్మన్‌గా ... సహాయ కమిషనర్, సార్వత్రిక విద్యాపీఠం సమన్వయ కార్య దర్శులుగా వ్యవహరిస్తారు. ప్రధానోపాధ్యాయులను అకడమిక్ కార్యదర్శులుగా నియమిస్తారు.

ఒకటి నుంచి పదో తరగతి వరకూ సమ్మెటివ్, ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నాపత్రాలను ఈ బోర్డుల ద్వారానే రూపొందించనున్నారు. ప్రశ్నాపత్రాల ప్రమాణాలను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) నిర్ణయిస్తుంది. జులై-ఆగస్టులో నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ పరీక్షల విభాగంపై 1969 తర్వాత మొదటిసారిగా ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.


- రాష్ట్ర పాఠశాల ప్రామాణిక అథారిటీని ఏర్పాటు చేస్తారు. ప్రస్తుత మార్పుల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను మదింపు చేస్తారు.
- పదో తరగతి పరీక్షల విభాగాన్ని స్వతంత్ర ప్రతిపత్తి విభాగంగా మార్చనున్నారు.
- పాఠశాల స్థాయి నైపుణ్యాభివృద్ధి కోర్సులను నిర్వహిస్తారు. వీటిని మదింపు చేసి, పదో తగతి బోర్డు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుంది.

**మూల్యాంకనంలో తప్పులకు జరిమానాలు**

పదో తరగతి పబ్లిక్ పరీక్ష మూల్యాంకనంలో తప్పులు చేస్తే ఆమేరకు ఉపాధ్యాయుల సర్వీసు పాయింట్లలో కోత, జరిమానా విధిస్తారు.

**విద్యార్థులపై వాతావరణ మార్పుల ప్రభావం**

వాతావరణ మార్పులతో పెరుగుతున్న ఉష్ణోగ్రత – బాలల్లో అభ్యసనశక్తిని దెబ్బతీస్తోందని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు తేల్చారు. భారత్ సహా 61దేశాల్లోని 1.45 కోట్లమంది ఇప్పటివరకూ జరిగిన ఏడు అధ్యయనాల సమాచారాన్ని విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చారు. ఈ అధ్యయనాల్లో ఒకటి బ్రిటన్ జరిపిన యంగ్ లైవ్స్ సర్వే. ఇథియోపియా, పెరూ, వియత్నాంలతోపాటు భారత్‌లోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో 12,000 మంది విద్యార్థులపై ఈ సర్వే నిర్వహించారు. పగటి ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెల్సియస్, అంతకుమించి ఉన్నప్పుడు భారత్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కఠినమైన ప్రశ్నలకు, కొన్ని లెక్కలకు సరైన సమాధానాలు ఇవ్వలేకపోయారు. వారి పుస్తక పఠనం కూడా దెబ్బతింది. ఉష్ణోగ్రత 15–17 డిగ్రీలుంటే ఇలాంటి సమస్యలు రాలేదు. మునుపటి సంవత్సరాల్లో ఉష్ణోగ్రతలను, విద్యార్థులపై ప్రభావాన్నీ అధ్యయనకర్తలు విశ్లేషించారు. వరుసగా, 10 రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే పఠన స్కోర్లు 0.02 శాతం, గణితం స్కోర్లు 0.03 శాతం తగ్గాయి. గ్రామీణ భారత విద్యార్థులపై వార్షిక విద్యానివేదిక (అసర్) సమాచార విశ్లేషణ కూడా ఈ సంగతి నిర్ధారించింది. ★




**జిల్లాల్లో స్వతంత్ర పరీక్ష బోర్డుకు ఎఫ్‌డీఆర్ సిఫార్సు**

మన పాఠశాల విద్యలో తీసుకురావాల్సిన తక్షణ మార్పులపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వం లోని ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం రూపొందించిన ఆచరణ సాధ్య పరిష్కారాల్లో స్వతంత్ర పరీక్షా బోర్డు ఒకటి. ఈ పరిష్కార పత్రాన్ని ఇటీవల తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, విద్యా కమిషన్, విద్యాశాఖ అధికారులకు జేపీ అందించి అందులోని సిఫార్సులను వివరించారు. పరీక్షల నిర్వహణ పద్ధతిని మార్చటం, విద్యార్థులకు ఒత్తిడి లేకుండా బేరీజు వేయటం ఇందులో కీలకమైనది. "విద్యార్థుల్ని ఆకస్మికంగా పరీక్షించటం, పర్యవేక్షించటం అనే పని ఫలవంతంగా జరగాలి. ఫలితాలు విశ్వసనీయంగా ఉండాలి. ఇందుకోసం ఎప్పటికప్పుడు ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆకస్మిక పరీక్షలకు స్వతంత్ర పరీక్షా బోర్డుల్ని ఏర్పాటు చేయాలని మేం సిఫార్సు చేస్తున్నాం. ఫలితాల్ని నిజాయతీగా, స్వతంత్రంగా బేరీజుపై ఈ సంస్థలు తగిన నమ్మకాన్ని కలిగించాలి. రాష్ట్రస్థాయిలో ఇందుకోసం ఒక సంస్థను ఏర్పాటు చేసి, ప్రతి జిల్లాలో విభాగాల్ని అందుబాటులోకి తేవాలి" అని ఎఫ్‌డీఆర్ పాఠశాల విద్య సంస్కరణల పత్రం సిఫార్సు చేసింది.

# మెగా పేటీఎంలో అవాంఛనీయ విధేయతలు

-డాక్టర్ కె.రమాప్రభ
సామాజిక కార్యకర్త

ఇటీవల ఒక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కి హాజరయ్యాను. ఇలాంటి సమావేశాలు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలోనూ, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడంలోనూ ఎంతో కీలకం. కానీ ఆ వేదికపై చోటు చేసుకున్న ఒక అంశం నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది.


ఈ సమావేశంలో పిల్లల చేత తల్లిదండ్రుల పాదాలకు మొక్కించారు. పాదాలను ముద్దాడమని చెప్పారు. ఇది స్వచ్ఛందంగా జరగలేదు. కొందరు పిల్లల ముఖాలలో ఇబ్బంది స్పష్టంగా కనిపించింది. మన దక్షిణ భారత సంస్కృతిలో ఇది అనూహ్యం. బెంగాల్ వంటి ఉత్తరాది ప్రాంతాల్లో కొన్ని కుటుంబాల్లో ఉండే సంప్రదాయం. మంచి ఎక్కడున్నా నేర్చుకోవచ్చు. కానీ ఇది సంప్రదాయం పేరుతో మన సమాజంలోకి అవాంఛనీయంగా ప్రవేశపెట్టే ప్రయత్నమా అనిపించింది. ఉపాధ్యాయుల పాదాల్ని పిల్లలతో మొక్కిం చడం కూడా చూశాను. ఇవన్నీ మన పిల్లలపై బలవంతంగా విధేయతను రుద్దే ప్రయత్నంగా అనిపించాయి. ఇలాంటి చర్యలు వెనుక ఉన్న భావజాలాన్ని సమీక్షించాల్సి ఉంది.

పిల్లలను గౌరవం పేరుతో తలవంచేటట్లు చేసే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని కలిగించడం ఎక్కువ అవసరం. ఈ పాదపూజలు, తలవంచే శిక్షణలు విద్యా లక్ష్యాలకు విరుద్ధం. ప్రముఖ విద్యావేత్త పాలో ఫ్రెయిర్ "విద్యార్థి ఒక ఖాళీ పాత్ర కాదు, ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని నింపే అధికారీ కాదు. ఇద్దరూ కలిసి వారి సంభాషణలో జ్ఞానాన్ని ఆవిష్కరించాలి" అంటారు.

విద్య ఇలాంటి విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహించాలి, గుడ్డి విధేయతను కాదు. గురువులు, పాఠ్య పుస్తకాలు చెప్పిన విషయాలను సొంత ఆలోచన లేకుండా ఆమోదించటం కంటే - వాటిని ప్రశ్నించడం, విశ్లేషించడం, కొత్త ఆలోచనలను అన్వేషించటం ముఖ్యం. శాస్త్రీయ ఆవిష్కరణలు, సామాజిక సంస్కరణలు ఎల్లప్పుడూ ప్రశ్నించే మనస్తత్వం నుండే జన్మించాయి. విద్యా వ్యవస్థలు పిల్లల్ని గుడ్డి విధేయత వైపుకి కాకుండా, స్వతంత్ర ఆలోచన దిశలోకి నడిపించాలి. తలవంచటం, పాదాభివందనం వంటి సంప్రదాయాలు గౌరవాన్ని సూచిస్తాయి, కానీ కొన్ని సందర్భాల్లో ఇవి విద్యార్థులలో భయం, ఆత్మవిశ్వాస లోపాల్ని సృష్టించవచ్చు. స్వతంత్ర ఆలోచనలు, ఆత్మగౌరవం లేని విద్యార్థి సమాజంలో తన గొంతును వినిపించలేడు, ఆధునిక సమాజంలో రేపటి పౌరులయ్యే నేటి విద్యార్థులు - భవిష్యత్తులో తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచటం, అన్యా యాన్ని ఎదిరించడం, సమాజంలో సానుకూల మార్పుల కోసం కృషి చేయడం అవసరం. కృత్రిమంగా తలవంచే సంస్కృతి ఈ ఆత్మవిశ్వాసాన్ని అణిచి వేయగలదు. గౌరవం అనేది హృదయంలోని భావం. కేవలం శారీరక చర్యల ద్వారా, లేదా బాహ్య ఉపచారాలతో మాత్రమే ఇది వ్యక్తం కాదు. పాదపూజలు చాలా సందర్భాల్లో భయం ఆధా రంగా ఏర్పడతాయి. గౌరవం, ప్రేమల ఆధారంగా కాదు. ఇలాంటి భయాధారిత సంబంధాలు పిల్లల విమర్శనాత్మక ఆలోచనలకు అడ్డుపడతాయి. పిల్లలు ఏ విషయాన్నయినా ప్రశ్నించే ధైర్యాన్ని కోల్పోతారు. 'పెద్దవారు చెప్పిందే నిజం అనే ధోరణి అలవాటవుతుంది. ఇప్పటి రాజకీయ వర్గాల్లో పాత విలువలు, గురుకుల పద్ధతులు, ధార్మిక విశ్వాసాల పేరుతో ఆధిపత్య నిర్మాణాలను తిరిగి బలపరిచే ప్రయత్నం జరుగుతోంది. సంస్కృతిలోని మంచిని పరిరక్షించాలి, అందుకు గర్వించాలి కూడా. కానీ ఆ పేరుతో ఇవాళ చేస్తున్న కొన్ని పనులు కేవలం సంస్కృతి పరిరక్షణ కాదు, అధికారాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నం. ప్రశ్నించే పిల్లలకు బదులుగా విధేయత చూపే తరం కావాలన్న లక్ష్యం దీని వెనుక ఉన్నది. ఇది కొత్తతరం ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచనను అణిచివేస్తుంది. అలాంటి తరం ప్రభుత్వాల్ని ప్రశ్నించదు, సమాజపు తేడాలను ఎత్తిచూపదు, అప్రజాస్వామిక నియంత్రణలను అంగీకరిస్తుంది. ఇది ఒక విధమైన సామాజిక మౌనాన్ని బలపరిచే విధానం.

జ్ఞానం పెద్దవారి వద్దే ఉండాలి, పిల్లలు వినాలనే పద్ధతి సరి కాదు. విద్యార్థులు తలవంచే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని పొందాలి. విద్య- విమర్శనాత్మక ఆలోచనను, స్వతంత్ర, అదే సమయంలో బాధ్యతాయుత దృక్పథాన్ని ప్రోత్సహించాలి. సంప్రదాయ గౌరవ వ్యక్తీకరణాలు ఆధునిక సమాజంలో భావాధారితంగా, పరస్పర గౌరవంతో కూడినవిగా పరిణమించాలి. విద్యార్థుల్లో స్వేచ్ఛ, సంభాషణ, ఆత్మవిశ్వాసం, బాధ్యతా యుత వైఖరి పెంపొందించడం ద్వారా మాత్రమే మనం రాజ్యాంగం ఆశిస్తున్న సమసమాజాన్ని, పురోగమన దేశాన్ని నిర్మించగలం. తలెత్తి హుందాగా నడిచే విద్యార్థులు సమా జంలో సానుకూల మార్పులు తీసుకురాగల నాయకులుగా మారతారు. ★

# జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా .. పార్టీల విప్ జారీ



సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, రాజకీయ సంస్కరణలు సంధిదశను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో చోటుచేసుకున్న ఒక కీలక పరిణామం - ఉపరాష్ట్రపతికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా.

గతంలో ముగ్గురు, నలుగురు ఉపరాష్ట్రపతులు రాజీనామా చేశారుగానీ, జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అందుకు భిన్నంగా కనిపిస్తుంది. రాజ్యసభ సీటు కోసం రూ.100-200 కోట్లు అలవోకగా విరాళం ముసుగులో ఇవ్వడం సాధారణమనే పరిస్థితి కొనసాగుతున్న తరుణంలో, ఆ సభకి చైర్మన్‌గా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి రాత్రికి రాత్రి నిశ్శబ్దంగా ఓ 'ఎక్స్' సోషల్ మీడియా ప్రకటనతో నిష్క్రమించడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రజాస్వామికవాదులకు అంతకంటే ఎక్కువ బాధ కలిగిస్తుంది.

చాలా మీడియా సంస్థలు పేర్కొన్నట్లు, ఇది అధికార పార్టీని ఇరుకున పెట్టే వ్యవహారమే కావచ్చుగానీ, అంతకంటే ఎక్కువగా మన ప్రజాస్వామిక పరిణతి గతికి విఘాతం. ఇది ఒక పార్టీకో, ప్రభుత్వానికో, ఓ వ్యక్తి త్యాగానికో పరిమితమైన విషయం కాదు - మన ప్రజాస్వామ్యంలో కీలకమైన రాజ్యాంగ సంస్థల్ని, రాజకీయ పార్టీల్ని నడుపుకుంటున్న తీరుకి నిదర్శనం.

ప్రజాస్వామ్యంలో మొదటి స్తంభం చట్టసభల వ్యవస్థ. మన పార్లమెంటరీ పద్ధతిలో ఎన్నికైన చట్టసభల నుంచే కార్యనిర్వాహక వ్యవస్థకు అధికారాలొస్తాయి. ప్రభుత్వాధినేతలలైతే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఆ చట్టసభలకు జవాబుదారీ. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి కలిగినదే అయినా, రాజ్యాంగాన్ని అనుసరించి ఎన్నికైన చట్టసభ చేసే శాసనాల్ని గౌరవించాల్సిందే. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే చట్టసభలను ఒక పరిధి దాటి న్యాయవ్యవస్థ ప్రశ్నించలేదు. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలు ఎన్నుకున్న అటువంటి చట్టసభల్ని నడిపించే స్పీకర్ ఎంత నిష్పక్షపాతంగా, ఒడుపుగా వ్యవహరిస్తే ప్రజలకు అంత సాధికారిత లభిస్తుంది. ఈ నేపథ్యంలోనే, మనం ఏ బ్రిటన్ నుంచి వెస్ట్ మినిస్టర్ నమూనాను తీసుకున్నామో అక్కడ స్పీకర్‌గా ఎన్నికైన సభ్యుడు తన పార్టీకి రాజీనామా చేస్తాడు. అతను లేదా ఆమె సభాకాలం పూర్తయ్యాక కూడా సాధారణంగా మళ్ళీ పార్టీలో చేరరు, ఏ ఇతర పదవీ తీసుకోరు. వారు మళ్ళీ స్పీకర్ కావాలనుకుంటే, ఎన్నికల్లో ఏ ప్రధాన పార్టీ వారి మీద అభ్యర్థిని నిలపదు. అంటే, స్పీకర్‌గా ఒక్కసారి ఎన్నికైన వ్యక్తి తన ఆసక్తి, సామర్థ్యాన్ని బట్టి జీవితకాలం ఆ పదవిలో కొనసాగవచ్చు. స్పీకర్ పదవి అంత కీలకమైనది, సభా నిర్వహణ పార్టీలకతీతంగా చేయవలసింది కాబట్టి అన్ని వెసులుబాట్లను స్పీకర్‌కే కల్పిస్తారు. మన దేశంలో ఆర్భాటాల్నీ, పెత్తనాన్నీ కోరుకోవడం ఎక్కువ కాబట్టి - స్పీకర్ పదవి వచ్చిన వారు తర్వాత మంత్రి పదవో, అలాంటి ఇంకో పదవి కోసం తాము వెయిట్ లిస్టులో ఉన్నట్టుగా భావించుకుంటారు. ఈ కారణంగానే, తాము ఎన్నికైన అధికారపక్షం వైపు మొగ్గు చూపే స్పీకర్లు మన దేశంలో ఎక్కువ. దీనివల్లే ప్రతిపక్షాల నుంచి అధికార పక్షంలోకి పార్టీ ఫిరాయింపులు మనదేశంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. ఫిరాయించినవారి అనర్హతను, వారి రాజీనామాల్ని తేల్చకుండా మళ్ళీ అసెంబ్లీ లేదా లోక్‌సభ కాల పరిమితి ముగిసే వరకు స్పీకర్‌లు పెండింగ్‌లో ఉంచడం మనవద్ద ఆనవాయితీగా మారింది. అందువల్లే ఫిరాయింపులపై న్యాయాధికారాన్ని స్పీకర్ నుంచి తొలగించి, ఎన్నికల సంఘానికి ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది ఫిర్యాదులకు సంబంధించి ఇలాంటి ప్రతిపాదనలు చేసేవారు సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. కానీ ఫిరాయింపులు ఒక రోగ లక్షణమే తప్ప, అసలు జాడ్యం కాదు. అసలు సమస్య పార్టీల్లో, ఎన్నికల వ్యవస్థల్లో, శాసన-కార్యనిర్వాహక వ్యవస్థల అధికారాల్ని విభజించకపోవడం వంటి అంశాల్లో ఉంది. ఇక్కడజగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాకు సంబంధించి మనం చట్టసభ పరిధిలో పార్టీల వ్యవహార శైలిని చర్చించటం మాత్రమే సందర్భోచితం. ప్రజలు నేరుగా జాతీయస్థాయికి ఎన్నుకున్న లోక్‌సభతో రాజ్యసభకు సమాన ప్రాధాన్యత ఉండదుగానీ, రాష్ట్రాల్లోని శాసనమండలి కంటే చాలా శక్తివంతమైనది. రాష్ట్రాల శాసన సభలకు ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఎన్నుకున్న సభగా, పెద్దల సభగా రాజ్యసభకు విలువ ఉంది. రాష్ట్రాలన్నిటికీ ప్రాతినిధ్యం వహించే శాశ్వత సభ ఇది. లోక్‌సభలా రద్దవడం ఉండదు. లోక్‌సభ స్పీకర్ లా రాజ్యసభ చైర్మన్ కూడా మనదేశంలో అధికార పక్షం నుంచే ఎన్నికవ్వడం ఆనవాయితీ. లోక్‌సభలోనైతే 2019 నుంచి

డిప్యూటీ స్పీకర్ స్థానానికి ప్రతిపక్షనేతను ఎన్నుకోవాలనే సంప్రదాయాన్ని కూడా పాటించకుండా 17వ సభాకాలం ముగిసిపోయింది. 18వ లోక్‌సభలో కూడా ఇంతవరకూ డిప్యూటీ స్పీకర్ నియామకం లేదు. రాబోయే కాలంలోనైనా ఆ పదవిని భర్తీ చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. లోక్‌సభ స్పీకర్ లాగే మన దేశంలో రాజ్యసభ స్పీకర్ కూడా తన పార్టీకి రాజీనామా చేయనవసరంలేదుగానీ, ఉప రాష్ట్రపతి రాజ్యాంగ పదవి కాబట్టి ఆ పదవిలో ఉన్నవారే ఎగువ సభకు డిప్యూటీ చైర్మన్ అవుతారు కాబట్టి తనకు ముందున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ జగదీప్ ధన్‌ఖడ్ కూడా బీజేపీకి రాజీనామా చేశారు.

2022 ఆగస్టు 11న ఉపరాష్ట్రపతి బాధ్యతలు తీసుకున్న జగదీప్ ధన్‌ఖడ్ – చాలా సందర్భాల్లో పార్టీ పక్షపాతంతోనే వ్యవహరించారని, తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దానికితోడు ఆయన పలు అంశాలపై బీజేపీకి అనుకూలంగా బయట సమావేశాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వివాదాస్పద ట్రాక్‌రికార్డుతో 2019 నుంచి పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ముప్పతిప్పలు పెట్టి, బీజేపీకి అక్కడ ఉనికిని పెంచారనే అభిప్రాయంతోనే మోదీ ఆయన్ను ఉప రాష్ట్రపతిగా ఎంపిక చేశారని, ధన్‌ఖడ్ నమూనాలో తెలంగాణలో తమిళి సై, ఇంకొన్ని రాష్ట్రాల గవర్నర్లు వ్యవహరించే ప్రయత్నం చేశారని కొందరి అభిప్రాయం.

రాజ్యసభ చైర్మన్ పదవిలో కూడా ఇలాగే వ్యవహరించారన్నమాట నిజం. ఈయన్ని 2027 దాకా భరించాల్సి ఉంటుందని విపక్ష సభ్యులు నిట్టూర్చిన మాట వాస్తవం. అందుకే రాజ్యసభ చరిత్రలో మొదటిసారిగా చైర్మన్ మీద అవిశ్వాస తీర్మానాన్ని విపక్షాలు ప్రతిపాదించాయి. అయితే, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా గీత దాటి అత్యుత్సాహంతో వ్యవహరించిన ధన్‌ఖడ్ – ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ హోదాలో జమిలి ఎన్నికలు వంటి అసంబద్ధ నిర్ణయాల్లో ప్రభుత్వాన్ని సమర్థించినా, చాలా సందర్భాల్లో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే మాట్లాడారు. ఉదాహరణకు, జడ్జీలను జడ్జిలే కొలీజియం ద్వారా నియమించుకోవటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఉన్నత న్యాయమూర్తుల నియామకానికి లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) కృషితో వచ్చిన జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించి, రాష్ట్రాల శాసనసభలూ ధ్రువీకరించినా సుప్రీంకోర్టు కొట్టివేయటాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. అదేవిధంగా 142వ అధికరణం పేరుతో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడాన్ని ప్రశ్నించారు. నోట్లకట్టలు బయటపడిన జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు అభిశంసన విషయంలో చురుగ్గా వ్యవహరించారు. అదేవిధంగా జస్టిస్ శేఖర్ యాదవ్ అనుచిత వ్యాఖ్యల్ని ఆక్షేపించారు. అయితే జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు లోక్‌సభలో బీజేపీ కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటున్న సమయంలో, రాజ్యసభలో 63 మంది ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసును ధన్‌ఖడ్ అనుమతించడం మోదీ ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించిందని సమాచారం. దీనికి తోడు ప్రతిపక్ష కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ఎక్కువసేపు మాట్లాడుతున్నా ధన్‌ఖడ్ వారించలేదని బీజేపీకి చిరాకు కలిగింది. 50 ఏళ్ల క్రితం నాటి కేశవానంద భారతి కేసులో రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చకూడదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును కూడా తప్పుపడుతూ, రాజ్యాంగంపై ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటుకే సుప్రీంకోర్టు కన్నా ఎక్కువ నిర్ణయాధికారం ఉంటుందని జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలతో అప్పటికే కొంత ఇరకాటంలో పడ్డట్టు భావించిన బీజేపీ నాయకత్వంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనల నేపథ్యంలో ధన్‌ఖడ్ చూపిన చొరవ మరింత ఇబ్బందికర పరిస్థితిని సృష్టించింది. మరోవంక, సభలో తాను చెప్పేదే రికార్డుల్లోకి వెళుతుందని బీజేపీ జాతీయాధ్యక్షుడు రాజ్యసభలో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ జేపీ నడ్డా చెయిర్ వంక చూడకుండా ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ధన్‌ఖడ్‌కి మనస్తాపం కలిగించినట్లు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో పార్టీయే ధన్‌ఖడ్‌ని రాజీనామా చేయమని కోరిందా లేక ఆరోగ్య సమస్యలు కారణంగా చూపి ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేశారా అనేది కాలక్రమంలో నిగ్గు తేల్చవచ్చు. కానీ ఇక్కడ మౌలికమైన అంశాలు ... రాజ్యాంగ పదవిలో ఉన్నవారు సైతం గెలిపించిన పార్టీ చెప్పిందే చేయాలన్న ధోరణి, ఇతర సభ్యులు కూడా సొంత అభిప్రాయాలతో కాకుండా పార్టీ విప్‌కు అనుగుణంగా వ్యవహరించటం, ఒకవేళ విప్‌ను ధిక్కరిస్తే సభలో సభ్యత్వాన్ని కోల్పోవాల్సిరావటం.

జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో ఉప రాష్ట్రపతి సరైన నిర్ణయం తీసుకునేందుకు స్వేచ్ఛగా వ్యవహరించారనటంలో సందేహం లేదు. ఇది మంచి సంప్రదాయం. అయితే అంతకుముందు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులా ధన్‌ఖడ్‌కి లౌక్యం ఉన్నట్లు కనిపించదు.

1989లో ఝున్‌ఝున్ నుంచి ఎన్నికై దేవీలాల్ చొరవతో యూనియన్‌లో వీపీ సింగ్ మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధాన మంత్రి అయ్యాక, జనతాదళ్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆర్ఎస్ఎస్‌ను, బాబ్రీ మసీదు కూల్చివేతను తీవ్రంగా విమర్శించారు. 1998లో ఎంపీగా ఓడిపోయాక రాజకీయాలకు దూరమై మళ్లీ న్యాయవాద వృత్తిని

కొనసాగించారు. ఆ తర్వాత అయిదేళ్లకు బీజేపీలో చేరి లీగల్ సెల్ ద్వారా రామజన్మభూమి తదితర కేసుల్లో న్యాయ సహాయం అందించి గుర్తింపు పొందారు. 2019లో పశ్చిమ బెంగాల్ గవర్నర్, ఆ తర్వాత ఉపరాష్ట్రపతి అయ్యారు. ఉప రాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ పేరును ప్రతిపాదిస్తూ, ఆయన గొప్ప న్యాయ కోవిదుడు, రాజ్యాంగం ఆయనకి కొట్టిన పిండి అంటూ మోదీ చెప్పిన మాటలు ఎంతవరకు నిజమో తెలియదు గానీ .. ఒకవర్గం రైతువ్యవసాయ చట్టాలపై వ్యతిరేకత చల్లార్చేందుకు ఆయనను ఎంపిక చేసినట్లు జాట్ కిసాన్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థపై కొన్ని అత్యుత్సాహపు వ్యాఖ్యల్ని ధన్‌ఖడ్ చేసిన మాట వాస్తవం. 2020లో వ్యవసాయ చట్టాల సవరణల్ని రాజ్యసభలో ఆమోదింపచేయటంలో వెంకయ్య నాయుడు ప్రదర్శించిన లౌక్యాన్ని ప్రదర్శించకపోవడం ధన్‌ఖడ్ పట్ల తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి మోదీ ప్రభుత్వం పెద్దగా సంశయించినట్లు కనిపించదు. కానీ, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పటి కంటే ఉప రాష్ట్రపతి అయ్యాక ధన్‌ఖడ్ స్వతంత్రంగా వ్యవహరించేందుకు మొగ్గుచూపినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. ఆ హక్కు, బాధ్యత కూడా ఆయనకుంది. తనకు ఆ పదవి ద్వారా సేవలందించేలా అవకాశమిచ్చిన పార్టీ ప్రయోజనాల్ని దెబ్బతీయకూడదుగానీ, పార్టీ ఏం చెప్పినా గుడ్డిగా సమర్థించడం కూడా ఆయన బాధ్యతల నిర్వహణకు అవరోధమని కూడా మనం విస్మరించకూడదు. ధన్‌ఖడ్ వ్యాఖ్యలను బీజేపీ బాధ్యత వహించనక్కర్లేదు. అదే సమయంలో లోపాలుంటే, బహిరంగంగానే తెలియ జేయవచ్చు. వివాదానికి తక్షణ కారణంగా భావిస్తున్న జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన విషయంలో ధన్‌ఖడ్ చేసింది సరైన చర్య. రాజ్యసభ చైర్మన్‌గా ఆయన హక్కు ఆయనకా హక్కు బాధ్యత ఉన్నాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని బలోపేతం చేయడానికి 2003లో 91వ రాజ్యాంగ సవరణను తీసుకురావడంలో ఎఫ్డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కీలక పాత్ర వహించారు. అయితే ఈ చట్టం లోని లోపాల్ని ఆయన బహిరంగంగా పలుమార్లు అంగీకరించారు. ఫిరాయింపుల నిరోధకానికి 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన 10వ షెడ్యూల్ వల్ల సభ్యులు పార్టీ విప్ ధిక్కరిస్తే సభలో సభ్యత్వం కోల్పోవడమనే తప్పిదాన్ని 91వ రాజ్యాంగ సవరణ సరిదిద్దలేకపోయిందంటారు. ఈ లోపం వల్లే, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇస్లాం ఛాందసుల్ని సంతృప్తి పరిచేందుకు రాజీవ్ గాంధీ ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ముస్లిం మహిళల భరణం చట్టం మానవ హక్కుల్ని ఉల్లంఘించిందని తెలిసినా పలువురు కాంగ్రెస్ ఎంపీలు అనుకూలంగా ఓటు వేశారంటారు. అదేవిధంగా, దేశ చరిత్రలో తొలిసారిగా జస్టిస్ రామస్వామి అనే ఒక అవినీతి న్యాయమూర్తి అభిశంసన విషయంలో కాంగ్రెస్ పార్టీ విప్ జారీచేసి వీగిపోయేలా చేసి, రాజ్యాంగ సంస్థలపై చర్యలు తీసుకునే అవకాశాల్ని బలహీనపరిచిందన్నారు. ఫిరాయింపులకు సంబంధించి కఠిన చర్యలు తీసుకునే బాధ్యతను ఈసీకి ఇవ్వటం కంటే ముందు తీసుకురావాల్సిన సవరణల్లో – రాజ్యసభలో విప్ జారీని తొలగించటం, లోక్‌సభ, అసెంబ్లీల్లో కూడా బడ్జెట్, విశ్వాస, అవిశ్వాస తీర్మానాలకు పరిమితం చేయటం ఒక కీలకాంశంగా జేపీ పేర్కొంటారు. ధన్‌ఖడ్ కూడా ఉప రాష్ట్రపతిగా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**విప్‌ను తప్పుబట్టిన ధన్‌ఖడ్**

కొన్ని నెలల క్రితం ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రాటిక్ లీడర్స్ సంస్థ విద్యార్థులను ఉద్దేశించి ఉప రాష్ట్రపతి హోదాలో ధన్‌ఖడ్ మాట్లాడుతూ, "అసలు పార్టీలు విప్ ఎందుకు జారీ చేయాలి? విప్ జారీ చేయడమంటే సభ్యుల స్వేచ్ఛను హరించటం, వారి అభివ్యక్తిని తొక్కి పెట్టడం, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల్ని పార్టీలు సేవకులుగా పరిగణించడం" అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో జరుగుతున్న అవరోధాలను ప్రస్తావిస్తూ, "ఒకప్పుడు పార్లమెంటు ప్రజాస్వామ్యానికి ఆలయం. ఇప్పుడది మల్ల యుద్ధ బరి" అని వ్యాఖ్యానించారు. సభామర్యాద అనే మాటను మరిచిపోయారని గౌరవం అనేది ఇప్పుడు లేదని ధన్‌ఖడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ ఫిరాయింపులు వంటి జాడ్యాలకు ఎన్నికల వ్యవస్థను మార్చటం సహా కొన్ని కీలక సంస్కరణలను జాతీయస్థాయి ప్రభుత్వం ఏకాభిప్రాయంతో సాధించటం అవసరం. కానీ వీటితోపాటు విప్ జారీని హేతుబద్ధీకరించి పరిమితం చేయడం కీలకం. ఎన్నికైన సభ్యులు ఏ పార్టీవారైనా స్వేచ్ఛగా తమ నియోజకవర్గ గొంతును, తమ అభిప్రాయాల్ని, పరిష్కారాల్ని సొంతంగా చెప్పే హక్కు ఉంది. ఆ గొంతును నొక్కకూడదని; సభ్యులకు, సభాధ్యక్షులకు స్వతంత్రంగా, అధికార పార్టీకి కాకుండా సభకు, ప్రజలకు, జవాబు దారీతనంతో వ్యవహరించే స్వేచ్ఛ ఉండాలని జగదీప్ ధన్‌ఖడ్ ఉదంతం తెలియచేస్తుంది. జాతీయస్థాయిలో ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి రాత్రికి రాత్రి పదవికి రాజీనామా చేసి నిష్క్రమించటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఎంత ప్రజాదరణ ఉన్నా ఈ విషయంలో బీజేపీ మొక్కుబడిగా కాకుండా బాధ్యతాయుతంగా స్పందించడం; ఇతర పార్టీలు కూడా అంతర్గత ప్రజాస్వామ్యం, సభ్యులకు నిబంధనల కనుగుణమైన స్వేచ్ఛా, ఇతర ఎన్నికల సంస్కరణలపై ఆత్మవిమర్శగావించుకుని ఏకాభిప్రాయంతో అమలుకు ముందుకు రావడం అవసరం. ★

# స్కూలు పాఠ్య పుస్తకాల్లోకి 'రైట్ టూ సర్వీసెస్' చట్టం




స్వతంత్ర భారతదేశంలో మైలురాయి సంవత్సరాలు నాలుగైదు ఉంటే, అందులో కీలకమైనది 1991. దేశం ఆర్థికంగా దివాళా తీసే పరిస్థితుల్లో..విధిలేని పరిస్థితుల్లో బ్రిటన్ బ్యాంకుకు బంగారం తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్న దుస్థితిలో..డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా సంస్కరణలను ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ప్రారంభించటం, బీజేపీ సహా కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఆ విధానాన్ని కొనసాగించటంతో బలమైన ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగు తుండటం నడుస్తున్న చరిత్ర! సరిగ్గా ఇదే ఏడాది బ్రిటన్‌లో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అదే ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల్ని నాణ్యతతో, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు ఉద్దేశించిన 'సిటిజన్ చార్టర్ల వ్యవస్థ'. ప్రజల్ని ద్వితీయశ్రేణి పౌరులుగా చూసే ఉద్యోగ వ్యవస్థను మనదేశంలో ప్రవేశపెట్టిన బ్రిటన్ తన దేశంలో ప్రజాస్వామిక పరిణితితోనే పౌరసేవల వ్యవస్థను పెంపొందించుకుంది. పౌర సేవలు సక్రమంగా అందుతున్నా, ఎవరూ పెద్దగా ఫిర్యాదు చేయకున్నా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల్ని ఇంకా మెరుగుపరిచేందుకు అక్కడి ప్రభుత్వం 1991లో సిటిజన్ చార్టర్స్ ఆలోచన చేసింది. పారదర్శకత, జవాబు దారీతనంతో పాటు నిర్దిష్ట కాల పరిమితిలో సేవలందించేలా 1992 చార్టర్ మార్క్ విధానాన్ని ప్రధానమంత్రి జాన్ మేజర్ నేతృత్వంలోని బ్రిటన్ ప్రభుత్వం తీసుకొచ్చింది.

**1996లో చొరవ**

ప్రభుత్వ సేవలు మెరుగుపరిచే స్ఫూర్తిని భారత్ బ్రిటన్ నుంచే తీసుకుంది.1996లో కాంగ్రెసేతర సంకీర్ణ ప్రభుత్వం ఇందుకు చొరవ తీసుకుంది. ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించాలని 1997లో ప్రధానమంత్రి అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశం తీర్మానించింది. సిటిజన్స్ చార్టర్లను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**'స్వరాజ్యం' తర్వాత సిటిజన్స్ చార్టర్ల బిల్లు**

1998లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్‌సత్తా తరపున ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల్ని సంకలనం చేసి 'స్వరాజ్యం' పేరుతో ప్రజా సేవల పత్రం పుస్తకంగా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రచురించారు. అక్టోబర్ 2న అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ దీన్ని విడుదల చేశారు. నాణ్యమైన పౌర సేవల్ని ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఎలా పొందాలో ప్రజలకు తెలియచేసే క్రమంలో.. పెట్రోలు బంకుల్లో తూనికల మోసాల్ని చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధ మార్గంలో ఎలా ఎదుర్కోవచ్చో లోక్‌సత్తా నిరూపించింది. చట్టంలోని హక్కుల్ని సక్రమంగా వినియోగించుకుంటే, ఓ చిన్న ప్రయత్నంతోనే ఈ దేశ ప్రజలకు లక్షల కోట్లు ఆదా చేయొచ్చని నిరూపించారు. ఆ తర్వాత సిటిజన్ చార్టర్ల బిల్లును రూపొందించి ఏపీ ప్రభుత్వానికి జేపీ అందచేశారు. 2001లో తణుకు, గుంటూరు, కుత్బుల్లాపూర్ మునిసిపాలిటీల్లో ప్రైవేట్ ప్రాజెక్టులుగా సిటిజన్స్ చార్టర్లను అమలు చేశారు. ప్రతి సేవకూ నిర్దిష్ట కాలపరిమితిని తెలియచేస్తూ కార్యాలయం బయట బోర్డులు పెట్టటంతో పాటు, ఆ గడువులోగా సదరు సేవని అందించలేకపోతే రోజుకు కొంత డబ్బును పరిహారంగా కూడా ప్రజలకు చెల్లించారు. సిటిజన్స్ చార్టర్లపై ప్రజల్లో ప్రచారానికి లోక్‌సత్తా కూడా ప్రభుత్వం ఇచ్చే పరిహారం డబ్బుకి అంతే మొత్తాన్ని తన తరపునుంచి కూడా జమచేసి దరఖాస్తుదారులకు అందించింది. అయితే వాటిని చట్టబద్ధం చేయకపోవటం, ప్రభుత్వం తరపున పెద్దగా ప్రచారం లేక పోవడంతో ఆ చార్టర్లు ప్రజల్లో ప్రాచుర్యం పొందలేదు. ప్రజలకు తమ హక్కులపై ఎంత తక్కువ అవగాహన ఉంటే, ప్రభుత్వ యంత్రాంగానికి అంత తక్కువ పని ఉంటుంది గదా! క్రమంగా సిటిజన్స్ చార్టర్స్ మరుగునపడ్డాయి. అయితే ఆ ప్రక్రియపై అధికారుల్లో, పౌరుల్లో తగిన ప్రచారాన్నయితే జేపీ చేయగలిగారు. సర్కారీ కార్యాలయాల్లో అందించే పౌర సేవల్ని లోక్‌సత్తా 'స్వరాజ్యం' పుస్తకం తరహాలో ఒకచోట చేర్చటంతో పాటు, వాటిని ప్రజలు తేలిగ్గా సకాలంలో పొందటానికి వీలుగా ఒక పోర్టల్ ని కూడా ప్రారంభించింది. 2004 తర్వాత యూపీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి యూనియన్ ప్రభుత్వ స్థాయిలో 107, రాష్ట్రాల స్థాయిలో 629 సేవలకు సిటిజన్స్ చార్టర్లు రూపొందాయి.

**'సర్వీసెస్ ఫస్ట్' స్థాయిని ఇంకా అందుకోలేకపోతున్నాం**

జాన్ మేజర్ ప్రభుత్వం సిటిజన్స్ చార్టర్లని, పౌర సేవల మెరుగుదలలో ఒక నిరంతర ప్రక్రియగా భావించింది. ఎక్కడ నమ్మకం, సౌకర్యం ఉంటే అక్కడ అందుకునేలా పోటీకి, ఎంపిక స్వేచ్ఛకి అవకాశం కల్పించింది. అదే విధంగా సేవలు సకాలంలో అందించలేకపోతే పరిహారం ఏర్పాటు చేశారు. ఈ నమూనాను 1998లో లేబర్ పార్టీ తరపున అధికారంలోకి వచ్చిన టోనీబ్లెయిర్ ప్రభుత్వం మరింత వ్యవస్థీకృతం చేసి 'సర్వీసెస్ ఫస్ట్' అని పేరు మార్చింది. బ్రిటన్ నుంచి స్ఫూర్తి పొందిన ఇతర దేశాలు రకరకాల పేర్లతో ఈ చట్టాన్ని అమలు చేసినా అదే ప్రామాణికతను కొనసాగించాయి. మన దేశంలో బ్రిటన్ నుంచి పేరు, ఆలోచన తీసుకున్నాం తప్ప – ఇప్పటికీ ఆ ప్రమాణాల్నీ అందుకోలేకపోతున్నాం. ప్రజలు, దేశ ఆర్థికాభివృద్ధి అవసరాలకు తగ్గ వేగంతో అడుగులు వేయటం లేదు.

యూపీయే ప్రభుత్వం తొలినాళ్లలో సిటిజన్స్ చార్టర్లపై కొంత హడావుడి చేసినా తర్వాత పట్టించుకోలేదు. ప్రధానమంత్రి

జాతీయ సలహామండలిలో సభ్యునిగా అరుణారాయ్ వంటి వారితో కలసి జేపీ ప్రోద్బలంతో సమాచార హక్కు చట్టాన్ని (ఆర్టీఐ) 2005లో తీసుకొచ్చినా, అంతకంటే ఎక్కువ శక్తివంతమైన సిటిజన్స్ చార్టర్ చట్టాన్ని పకడ్బందీగా తీసుకురావటానికి మన్మోహన్ సర్కారు వెనకడుగు వేసింది. 2జీ స్పెక్ట్రం కేసులో లోక్‌సత్తా చొరవతో సుప్రీంకోర్టు అక్రమ లైసెన్స్ లన్నీ రద్దు చేసింది. ఆ తర్వాత యూపీయే-2 సర్కారుపై ఉన్నవి, లేనివి అవినీతి ఆరోపణలు ప్రతిపక్షాల నుంచి అన్నా హజారే ఉద్యమ నేపథ్యంలో వెల్లువెత్తటంతో- అప్పుడు తొలుత లోక్‌పాల్, ఆ తర్వాత 'రైట్ టూ సర్వీసెస్' (హక్కుగా పౌరసేవలు) బిల్లుల్ని డ్రాఫ్ట్ చేయాలని మన్మోహన్ ప్రభుత్వం లోక్‌సత్తాను కోరింది. ఎఫ్డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన లోక్‌పాల్ బిల్లు అభినందనీయ చర్చతో పార్లమెంట్ ఆమోదం పొందిందిగానీ, రైట్ టూ సర్వీసెస్ (ఎలక్ట్రానిక్ సేవలు సహా) బిల్లు ప్రవేశపెట్టే సమయానికి లోక్ సభ రద్దయి ఎన్నికలు వచ్చాయి. అప్పటికే లోక్‌సత్తా పార్టీ తరపున నడుపుతున్న 'పౌర సహాయ కేంద్రాల' ఫీడ్ బ్యాక్‌తో సమగ్రంగా రైట్ టూ సర్వీసెస్ బిల్లును లోక్ సత్తా రూపొందించింది. 2014లో మోదీ ప్రభుత్వం వచ్చాక కూడా జేపీ హక్కుగా పౌర సేవల చట్టం కోసం ప్రయత్నాల్ని కొనసాగించారు. బ్రిటన్ కి భిన్నంగా పౌర సమాజ సంస్థల్ని, ప్రజా సంఘాల్ని, సుప్రసిద్ధ ప్రజా సేవకుల్ని, రిటైర్డ్ ఉన్నతోద్యోగులు, న్యాయకోవిదుల్ని ఇందులో భాగస్వాముల్ని చేస్తూ పలు సమావేశాలు నిర్వహించి గతంలోని బిల్లును ఇంకా మెరుగుపరిచే ప్రయత్నం చేశారు. ప్రజల్లో పెరుగుతున్న ఆకాంక్షల్ని గుర్తించి, సిటిజన్స్ చార్టర్ 2.0 కార్యక్రమానికి మోదీ నేతృత్వంలోని యూనియన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

కాస్త ముందుచూపున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ముఖ్యంగా పట్టణ జనాభా వేగంగా పెరుగుతున్నచోట సిటిజన్ చార్టర్ మీద దృష్టి సారించాయి. ఎంత గొప్ప తాత్కాలిక తాయిలమైనా ఒక ఎన్నికకు మించి పని చేయదని.. ఓటుకు నోటు, తాత్కాలిక తాయిలాలు యథావిధిగా అన్నట్లు ఇస్తూనే, సమ్మిళిత ఆర్థికాభివృద్ధి, నాణ్యమైన పౌర సేవల్ని ప్రజలు కోరుకుంటున్నారని అర్థం కావటంతో, గతంలో పెద్దగా పట్టించుకోకుండా మొక్కుబడిగా ప్రవేశపెట్టిన పౌర సేవల ఏర్పాట్లకు బూజు దులుపుతున్నాయి.

**మహారాష్ట్ర సమగ్ర ప్రయత్నం**

తెలంగాణ ఏర్పడ్డాక గ్రామజ్యోతి పథకం వంటి ఆదర్శాలను వల్లించిన కేసీఆర్ ప్రభుత్వం ఆ ఒరవడిలో కొత్త మునిసిపల్ చట్టాన్ని తీసుకొచ్చి పౌర సేవల్ని మెరుగుపరిచేందుకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్స్ చార్టర్స్ అమలును అందులో చేర్చింది. గ్రామజ్యోతిలాగా అది కూడా మొక్కుబడి మాటగా మిగిలిపోయిందనుకోండి. దాదాపు అదే సమయంలో (2015) మహారాష్ట్ర ప్రభుత్వం 'మహారాష్ట్ర రైట్ టూ పబ్లిక్ సర్వీసెస్ యాక్ట్'ని తీసుకొచ్చింది. ఇందుకోసం ఓ పోర్టల్‌ని ప్రారంభించింది. ఒక చీఫ్ కమిషనర్‌ని, ఆరుగురు జోనల్ కమిషనర్‌లని చట్ట పర్యవేక్షణకు నియమించింది. ప్రభుత్వ గెజిట్‌లో నోటీఫై చేసిన ప్రతి సేవా ఆర్టీపీఎస్ఏ చట్ట పరిధిలోకి వస్తుందని తెలిపింది. అయితే 2024 వరకు కేవలం 500 సేవలను మాత్రమే నోటిఫై చేశారు. దాంతోపాటు, పోర్టల్ లో నమోదు, ఫిర్యాదులకు సంబంధించి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల రైట్ టూ సర్వీసెస్ చట్టం అమలు మీద గట్టిగా దృష్టి సారించారు. దీంతో సేవల సంఖ్య 1027కు చేరుకుంది. ఆర్టీపీఎస్ఏను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో స్వచ్ఛంద సంస్థలు, కాలనీ అసోసియేషన్లు మొదలైన వాటితో ప్రత్యేక సమావేశాల్ని నిర్వహిస్తున్నారు.

**జరిమానా విధింపు..**

ప్రస్తుతం చట్టంలో పౌరులు తమ దరఖాస్తు తిరస్కారానికి గురైన 30 రోజుల్లోగా మొదటి, రెండవ అప్పీలేట్ అధారిటీలకు పిటిషన్ దాఖలు చేసుకునే అవకాశముంది. అక్కడా సంతృప్తి చెందకపోతే, చీఫ్ కమిషనర్‌కి అప్పీల్ చేయొచ్చు. అధికారి తప్పు చేసినట్లు తేలితే రూ.500 నుంచి 5,000 వరకు జరిమానా విధించే అధికారం వీరికి ఉంది. ప్రత్యేక సందర్భాల్లో లిఖితపూర్వక ఆదేశంతో అదనపు జరిమానా, చర్యలు చేపట్టవచ్చు. అయితే నష్టపోయిన పౌరునికి పరిహారం చెల్లించే ఏర్పాటు లేదు. నిర్దేశిత కాల పరిమితిలోగా సేవలందించకపోతే, దరఖాస్తుదారునికి పరిహారం రోజుకు ఇంత చొప్పున ఎన్నిరోజులు ఆలస్యమైతే అంత మొత్తాన్ని చెల్లించే నిబంధనల్ని కూడా ఆర్టీపీఎస్ఏలో చేరుస్తామని చీఫ్ కమిషనర్ తెలిపారు. వీటన్నిటితోపాటు, విస్తృత ప్రచారంలో భాగంగా రైట్ టూ పబ్లిక్ సర్వీసెస్ చట్టం గురించి ఒక అధ్యాయాన్ని 9,10వ తరగతుల పాఠ్య పుస్తకాల్లో చేర్చేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందని పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో 'మన మిత్ర' వాట్సాప్ పౌర సేవలు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని అడుగులు ముందుకేసి పౌర సేవల్ని వాట్సాప్ ద్వారా అందించే కార్యక్రమానికి 2025, జనవరి 30 నుండి శ్రీకారం చుట్టింది. 'మన మిత్ర' పేరుతో 160 సేవల్ని తొలుత అందించారు. 9552300009 నంబర్‌కి హాయ్ చెబితే, వెంటనే వాట్సాప్‌లో పౌర సేవలు ప్రత్యక్షమవుతాయి.

ఈ సేవల్ని 1000కి పైగా పెంచాలని, ఆన్‌లైన్ ద్వారా అందించగలిగిన ప్రతి సేవనీ వాట్సాప్ ద్వారా అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల అధికారులను ఆదేశించారు. ఏపీలో ఇంటర్మీడియెట్ తాజా ఫలితాలను కూడా వాట్సాప్ ద్వారా విడుదల చేసి విద్యార్థులు చిటికెలో ఫలితాల్ని చూసుకునే అవకాశం కల్పించారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణ ఉన్నా..**

వాట్సాప్ ద్వారా పౌరసేవల్లో రియల్ టైమ్ పర్యవేక్షణ ఉంటుందని, నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు పరిష్కారం కాకపోతే, దానంతటదే పై అధికారి వద్దకు ఫార్వర్డ్ అవుతుందని, దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చాలా సేవలు ప్రజలకు సకాలంలో అందుతాయని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. కచ్చితంగా ఇది అవసరమైన, సమర్థవంతమైన ప్రయత్నమే గానీ.. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు పౌరుల దరఖాస్తుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన సందర్భాలు మన

పాలనా వ్యవస్థలో అనేకం. చిన్న చిన్న విషయాలు, స్థానికంగా పరిష్కారమయ్యే అంశాలు,అర్జీలు కూడా ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్ల దాకా వస్తున్నాయని చంద్రబాబు ఎన్నిసార్లు వాపోలేదు? సుమారు 58 శాతం మంది అర్జీదారులు ప్రభుత్వ సేవల పట్ల అసంతృప్తితో ఉన్నారని తాజా ఆడిటింగ్ లో కూడా వెల్లడైంది.

కాబట్టి పెట్టుబడిదారులకు ఎలాగైతే నిర్దిష్ట కాలపరిమితిలోగా అనుమతులు, లేకుండా సంబంధిత విభాగం అధికారులపై జరిమానా, ఇతర చర్యలు, దరఖాస్తు దారులకు పరిహారం వంటి ఏర్పాట్లతో సర్వీస్ గ్యారంటీ చట్టం ఎలాగైతే ఏర్పాటు చేశారో, అదే తరహాలో పౌరులందరికీ కూడా వాట్సాప్, వాట్సాపేతర సేవలకి కూడా హక్కుగా సర్వీస్ చట్టాన్ని అమలు చేయాలి. దీనివల్ల ఒక వ్యవస్థీకృత ఏర్పాటు సాధ్యమై, పౌర సేవల్ని నిరంతరం మెరుగుపరిచే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నికల అసలైన లక్ష్యం నెరవేరుతుంది.

**యూనియన్ ప్రభుత్వం తరపున చర్యలు**

టెక్నాలజీలో యూపీయే ప్రభుత్వం చేసిన ప్రయత్నాల్ని, సాధించిన విజయాల్ని మరింత సమర్ధంగా మోదీ ప్రభుత్వం కొనసాగించింది, వినియోగిస్తోంది. ఉదాహరణకు ఆధార్. అదేవిధంగా వాట్సాప్‌ను కూడా సమర్థంగా వినియోగిస్తోంది. భారత న్యాయ సంహితలో వాట్సాప్ ద్వారా జీరో ఎఫ్ఐఆర్, ఈ-ఎఫ్ఐఆర్ నమోదుకు అవకాశం కల్పించారు. 'మైగవ్' ఆన్ లైన్ వేదిక ద్వారా 9 కోట్ల మంది వాట్సాప్ వినియోగదారులతో సమాచారం పంచుకుంటోంది. ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డుదారులకు ప్రపంచస్థాయి ఇమ్మిగ్రేషన్ సౌకర్యాలను అందించేందుకు ఓసీఐ పోర్టల్‌ను ఆధునీకరించింది. కానీ సిటిజన్స్ చార్టర్ 2.0లో నైనా ప్రతి సేవనూ నోటిఫై చేసి, మొబైల్ అప్లికేషన్‌తో అనుసంధానం చేసి, ఆలస్యానికి ప్రజలకు పరిహారం చెల్లించే ఏర్పాటు చేస్తేనే యూనియన్ ప్రభుత్వం కూడా పౌర సేవల్లో గణనీయ ముందడుగు వేసినట్లవుతుంది.

**సమస్యలు – భవిష్యత్ కార్యాచరణ:**

హక్కుగా పౌరసేవల అమలు చాలా నెమ్మదిగా పురోగమించటానికి ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో పాతుకుపోయిన వలసకాలపు ఆలోచనా తీరుకు తోడు అనుమానాలు, పౌరుల్లో అవగాహన కొరవడటం పెద్ద కారణాలు. ప్రభుత్వం కూడా కొన్ని రాష్ట్రాల్లో మినహాయించి సరైన ప్రచారం నిర్వహించడం లేదు. సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా సేవలకు కాలపరిమితిని నిర్ణయించటం కూడా కొన్ని సమస్యలను సృష్టిస్తోంది. ప్రపంచ దేశాల అనుభవాలు, మన దేశంలోనే కొన్ని రాష్ట్రాల మెరుగైన పనితీరు నుంచి నేర్చుకునే సంస్కృతి కొరవడటమూ సమస్యకు ఒక కారణంగా ఉంది. ప్రభుత్వోద్యోగులూ ప్రజా సేవకుల.. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే అని స్పష్టంగా తేల్చి చెప్పలేని రాజకీయ బలహీనత మరో కారణం.

**పటిష్టంగా అమలు – నిరంతరం మెరుగుపరచాలి**

అధికారం-సమ్మిళిత ఆర్థికాభివృద్ధి – నాణ్యమైన సౌకర్యవంతమైన పౌరసేవల మధ్య సంబంధం ఈమధ్య ఎన్నికల ఫలితాల్లో కూడా ప్రతిఫలిస్తోంది. కాబట్టి హక్కుగా పౌరసేవల చట్టం (రైట్ టూ సర్వీసెస్) తేవటం, పటిష్టంగా అమలు చేయటం, నిరంతరం మెరుగుపరచటం ప్రభుత్వాలు, పార్టీలు తమ రాజకీయ ఎజెండాలో భాగం కావించుకోవాలి. ఈ క్రమం లో ఈ కింది చర్యల్ని తమ హామీలు, కార్యాచరణగా మార్చు కోవాలి:

☞ రైటు టూ సర్వీసెస్ చట్టం అవసరం, అమలు తీరు గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి

☞ ప్రభుత్వ కార్యాలయం ముందు సిటిజన్స్ చార్టర్‌ల జాబితా బోర్డు, అందులో నిర్దిష్ట గడువు, ఫీజు, సకాలంలో పని పూర్తి చేయలేకపోతే దరఖాస్తుదారునికి పరిహారం చెల్లింపు వివరాల్ని పొందుపరచాలి.

☞ అప్పీలేట్ అథార్టీలను సంప్రదించేందుకు, సమన్వయానికి, సంప్రదింపులకు తగిన వివరాల్ని స్పష్టంగా తెలిసేలా ప్రదర్శించాలి. యూనియన్ ప్రభుత్వం ఇటువంటి చట్టం తీసుకొచ్చి రాష్ట్రాలకు మెరుగైన నమూనాను అందించాలి.

☞ సేవల నాణ్యతకు అద్దంపట్టే ఐఎస్ఐ 9001 వంటి గుర్తింపుల తరహాలో – మెరుగైన సేవలందించే విభాగాలకు ఏటా పురస్కారాల్ని ప్రకటించాలి.

☞ వాట్సాప్ సహా పౌర సేవల్లో సాంకేతికతల వినియోగంలో వ్యక్తిగత సమాచారం చోరీకి గురికాకుండా, గోప్యతకు భంగం కలగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

☞ పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాటు – ఎక్కడైనా పౌర సేవల్ని పొందగలిగేలా, నచ్చిన చోటు నుంచి సేవల్ని అందుకునేలా ఏర్పాటు చేయాలి. పోటీ, ఎంపిక స్వేచ్ఛకు అవకాశం కల్పించాలి.

☞ ప్రజలు పన్నులు కట్టటంతో పాటు చాలా పౌర సేవలకి రుసుము కూడా చెల్లిస్తారు కాబట్టి.. వారికి హక్కుగా సేవలందించటం తమ చట్టబద్ధ బాధ్యతని ప్రభుత్వం, పాలనా యంత్రాంగం సరైన ప్రక్రియ ద్వారా సేవల్ని పొందటం తమ హక్కు అని దరఖాస్తుదారులు గుర్తించాలి.

☞ మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా, సైబర్ నేరాలు, మధుమేహం, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు, ట్రాఫిక్ నిబంధనలు, రాజ్యాంగ మౌలికాంశాలకు సంబంధించి పాఠశాల స్థాయిలో బోధిస్తున్నట్లు – రైట్ టూ సర్వీసెస్ గురించి కూడా విద్యార్థుల్లో అవగాహన కలిగించాలి. ఇందుకోసం ఏవో కార్యక్రమాలు, ఉపన్యాసాలు మాత్రమే కాకుండా –మహారాష్ట్ర తరహాలో హైస్కూలు స్థాయిలో పాఠ్యాంశంగా చేర్చాలి. పరీక్షల్లో సంబంధిత ప్రశ్నల్ని కాన్సెప్ట్ తో పాటు సోదాహరణంగా జవాబు రాసేలా అడగాలి. వీటన్నిటితో పాటు, స్థానిక ప్రభుత్వాల బలోపేతం అత్యంత కీలకం. పౌరసేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం దాదాపు లేని అభివృద్ధి చెందిన దేశాలన్నిటిలో స్థానిక ప్రభుత్వాలు ఎంతో బలంగా ఉన్నాయి. మహా నగరాలతో పాటు.. గ్రామాల మధ్య చిన్న పట్టణాలనూ అభివృద్ధి చేయాలి. చిన్న పట్టణాల అభివృద్ధి, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులూ ఇస్తే రైట్ టూ సర్వీసెస్ చట్టం పూర్తిస్థాయి ఫలితాలనిస్తుంది. ★

# జనగణనకు సిద్ధమవ్వండి

వచ్చే ఏడాది జరగనున్న జనగణన కోసం ఈ ఏడాది డిసెంబర్ 31 లోగా పాలనాపరమైన యూనిట్ల సరిహద్దుల్లో ఏవైనా మార్పులు చేర్పులుంటే పూర్తి చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు యూనియన్ ప్రభుత్వం సూచించింది. గ్రామాలు, పట్టణాలను ఏకీకృత గణన బ్లాకులుగా విభజిస్తామని, ప్రతి బ్లాక్‌కి గణకుడిని (ఎన్యుమరేటర్) నియమిస్తామని, దానివల్ల జనాభా గణనలో లోపాలు లేకుండా చేయగలమని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ లేఖ రాశారు. నిబంధనల ప్రకారం – జిల్లాలు, ఉప జిల్లాలు, తహశీళ్లు, తాలూకాలు, పోలీస్ స్టేషన్ల సరిహద్దులను నిర్ధారించిన 3 నెలల తర్వాతే జనగణన చేపడుతారు. 2026 ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలిదశ ప్రారంభమవుతుంది. 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 దాకా మళ్ళీ సరిహద్దుల మార్పుకి అంగీకరించరు. 2026 ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలి విడతలో భాగంగా హౌస్ లిస్టింగ్ ప్రారంభిస్తారు.

❖ స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా కులం సహా చేపడుతున్న జనగణనలో జాతీయస్థాయిలో ఒకే విధానం పాటిస్తారు.

❖ జనగణనకు యూనియన్ ప్రభుత్వం ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర జనాభా లెక్కల డైరెక్టరేట్లు సన్నద్ధమవుతున్నాయి.

❖ జనాభా లెక్కల సేకరణ 2 దశలుగా జరుగుతుంది. మొదటి దశలో రాష్ట్రంలో ఎన్ని ఇళ్లు, కట్టడాలు ఏయే రకాలు ఉన్నాయి వాటిలో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయనే వివరాలు సేకరిస్తారు. వీటిని 2026 ఏప్రిల్, మే నెలల్లో స్వీకరిస్తారు.

❖ రాష్ట్ర ప్రభుత్వ సమాచారంతో జాతీయస్థాయి ప్రభుత్వం నిర్వహించే జన గణనకు ఎలాంటి సంబంధం లేదు. రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు తీసుకుంటారు.

❖ ప్రతి కుటుంబం నివసించే ఇంటిలో మౌలిక సదుపాయాల వివరాలన్నీ సమగ్రంగా నమోదు చేస్తారు.

❖ రెండో దశలో 2010 ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి ఒక్కరి వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తారు. దీంతో జనగణన పూర్తవుతుంది.




❖ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే 80 వేలమందికి పైగా ఇందులో పనిచేస్తారు. మునిసిపల్ కమిషనర్లు, కలెక్టర్లు నోడల్ అధికారులుగా ఉంటారు.

❖ జనగణనలో వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులే సేకరించినా సేకరణ విధానం రాష్ట్రస్థాయితో పోలిస్తే భిన్నంగా ఉంటుంది.

❖ప్రతి రాష్ట్రానికి విడివిడిగా కులగణన విధానం ఉండదు. యూనియన్ ప్రభుత్వం జాతీయస్థాయిలో జనాభా లెక్కల సేకరణకు అనుసరించే విధానంలోనే కులగణన చేస్తారు.

❖ రాష్ట్రాలవారీగా బీసీల్లో ఉన్న కులాల వివరాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల వద్ద అధికారిక జాబితాల్లో ఉంటాయి. ఆ ప్రకారం ఏ కేటగిరిలో కులం ఉంటే వారిని అదే జాబితాలో చేరుస్తారు. దీనివల్ల వెనుకబడిన వర్గాల జాబితాలో రాష్ట్రాల మధ్య తేడా సమస్య తలెత్తదు. ఒక రాష్ట్రంలో ఒక కులం బీసీ అయితే, మరో రాష్ట్రంలో అది ఓసీలో ఉన్న దాఖలాలున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకుంటున్నారు.

❖ అదేవిధంగా, దంపతులు వేరువేరు కులాలు, మతాలకు సంబంధించినవారైతే ప్రతి ఒక్కరి కులం, మతం విడివిడిగా నమోదు చేస్తారు.

❖ వ్యక్తిగతంగా కుల వివరాలు సేకరణ 2027లో జరుగుతుంది.

❖ ప్రజలు వ్యక్తిగతంగా ప్రత్యేక యాప్ ద్వారా ఆన్ లైన్ లో వారి వివరాలను నమోదు చేసే అవకాశం ఇచ్చినా దానిపై మరోసారి తనిఖీ ఉంటుంది. గణకులు ఇళ్ళకు వెళ్ళినప్పుడు సరి చూసుకుంటారు. ★

# భారత్ ఏ రకంగానూ మృత ఆర్థిక వ్యవస్థ కాదు

# అమెరికాకో న్యాయం, భారత్‌కో న్యాయమా?

డెత్ ఎకానమీ దేశాలంటే, సంపద సృష్టించకుండా భూమిలోని ఖనిజాలు, చమురు, బొగ్గు వంటివి ఉపయోగించుకొని బతికేవి. ఎక్కువ వ్యవసాయా ధారితమైనవి. 21వ శతాబ్దానికి అవసరమైన మేధస్సు, సాంకేతికతల వినియోగంపై పట్టులేనివి. ఇతర దేశాలిచ్చే ఆర్థిక సహాయాల మీదే ఎక్కువగా ఆధారపడేవి. ఎవరన్నా దయదలచి ఇవ్వటం తప్ప – అప్పు కూడా పుట్టనంత అప్పుల్లో కూరుకుపోయినవి. ఉదాహరణకు పాకిస్థాన్, సోమాలియా, జింబాబ్వే, ఇథియోపియా వంటి దేశాలు. ఇంకొన్ని దేశాలు సొంత ఆదాయం బాగున్నా అవి ఎక్కువగా భూమి లోపలి చమురు, బొగ్గు వంటి వనరుల ద్వారా వచ్చేవి. వాటితో పాటు ఆయుధాలు, సైనిక జోక్యాలు వంటివాటి ద్వారా సంపాదించేవి. ప్రాంతాలు, ప్రజల మధ్య తీవ్ర అసమానతలుండేవి. పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు లేనివి. ఇవి మృత ఆర్థిక వ్యవస్థలు కాదుగానీ – కుంచించుకుపోతున్న దేశాలు. ఉదాహరణకు, రష్యా, అర్జెంటీనా వంటివి. వీటిల్లో ఏరకంగా చూసినా భారతదేశం వేగంగా పెరుగుతున్న సజీవ ఆర్థిక వ్యవస్థ. పనిచేసే జనాభా ఎక్కువ ఉండటంతో పాటు, ప్రపంచంలోనే అత్యధిక వేగంగా పెరుగుతున్న దేశం. కొనుగోలు ధరల విలువరీత్యా భారత్ ఇప్పటికే ప్రపంచంలో మూడో స్థానంలో ఉండగా, 2047 నాటికి అమెరికా, చైనాల స్థాయికి ఎదిగే అవకాశాలున్న దేశం. ఈవేళ అమెరికా జీడీపీ వృద్ధి 2% లోపు కాగా, భారత్ వృద్ధిరేటు 6–5%గా ఉంది. భారత్‌లో 1% మందికి మంచి విద్య వస్తేనే అమెరికాలో కీలక రంగాల్ని శాసించగలుగుతున్నారు. అది వంద శాతానికి విస్తరిస్తే? ఇది పూర్తిగా సాధ్యం. భారతీయులకు ఉద్యోగా లివ్వొద్దని పెద్ద టెక్ కంపెనీలకు హుకుం జారీ చేయటాన్నిబట్టే – ఇండియా సామర్థ్యమేంటో ట్రంప్ చెప్పకనే చెబుతున్నారు. 'ఇజ్రాయిల్‌కి మరణం', 'అమెరికాకి మరణం' అని శాపనార్థాలు పెట్టినందుకే ఇరాన్‌పై అంత భారీ ఎత్తున దాడి చేశారే – మరి మీకో న్యాయం, భారత్‌కో న్యాయమా?

ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం, తన ఘన విజయానికి ఆర్థికంగా, ప్రచారపరంగా గణనీయంగా దోహదం చేసిన ఎలాన్ మస్క్‌నే ఆయన పుట్టిన దక్షిణాఫ్రికాకు తరిమేస్తానన్న వ్యక్తి ట్రంప్! ఏ దేశాధ్యక్షుడూ ఆస్థాయి సంపన్నుడిని, సాంకేతిక ప్రగతిని వదులుకోడు. చివరికి ఎప్‌స్టీన్ ఫైల్స్



ప్రచారంలోకి రావటం, కొందరు శ్రేయోభిలాషుల జోక్యంతో మస్క్ పట్ల మళ్లీ సానుకూలంగా మాట్లాడుతున్నారు. అలాంటి ట్రంప్ వ్యాఖ్యలు పట్ల అనాలోచితంగా రాహుల్ స్పందించడం, ఆ భాష, హావభావాలు ఆయన స్థానానికి తగినట్టుగా లేవు. ముఖం మీద కోపంతో ముక్కు తెగ్గోసుకుంటే నష్టం ఎవరికి?

**భారత్ ఓపిగ్గా అమెరికా లాంటి దేశాలతో వ్యవహరించాలి**

ట్రంప్ 2.0 భారత్ పట్ల భిన్నమైనదని మోదీకి కొంత అర్థమైందనటంలో సందేహం లేదు. జైశంకర్ చైనా పర్యటనలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన చైనా పట్ల సానుకూల వైఖరిని కనబరిచారు. అయితే చైనా పట్ల అతిగా మొగ్గితే అమెరికాతో కంటే ఎక్కువ చేదు అనుభవం చవిచూడాల్సి ఉందనటంలో సందేహం లేదు. ఏదోక పక్షం వైపు బలంగా మొగ్గు చూపే స్వభావం నుంచి మధ్యేమార్గ పరిణితిని మోదీ ప్రదర్శించడం అవసరం. రష్యాతో బంధం బలమైనదే అయినా, ఒక పరిధి దాటి ప్రయోజనం తక్కువ. అన్ని రకాలుగా అమెరికాతో సత్సంబంధాలే భారత్‌కి లాభదాయకం. భారత్‌కి ఎక్కువ ఆదాయాన్నిచ్చే సేవారంగం పైనే అమెరికా సుంకాలు విధిస్తే ఆర్థిక వ్యవస్థకు చాలా నష్టం వస్తుంది. ఈ నేపథ్యంలో భారత్ ఓపిగ్గా, పూర్తి ఆచరణ సాధ్యంగా, లౌక్యంగా ఒకప్పుడు డబ్ల్యూటీవోలో చేరినప్పుడు చైనా తరహాలో వినమ్రంగా వ్యవహరించడం అవసరం. ఆత్మవిశ్వాసం తప్ప – అత్యుత్సాహం, ఆధిపత్య ధోరణి పనికిరాదు. రెండేళ్ల క్రితం న్యూఢిల్లీలో జరిగిన జీ–20 సదస్సుపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పందిస్తూ, ఇది భారత్ ప్రతిష్టను ఇనుమడింపజేసేది అని చెబుతూనే,

ఒక హెచ్చరిక చేశారు.చైనా పట్ల భయంతో భారత్ ఎదగాలని ప్రపంచంలో అమెరికా సహా చాలా దేశాలు కోరుకుంటున్నాయని జేపీ అన్నారు. ఇందుకు ప్రజా స్వామ్యం, భారతీయ సమాజంలోని మధ్యేమార్గం, దాంతో పాటు పనిచేసే వయసులోనివారు, యువత ఎక్కువగా ఉండే వేగంగా ఎదుగుతున్న మార్కెట్ కావడం ప్రధాన కారణాల న్నారు. అమెరికా, ఇతర పలు దేశాల్లో భారతీయులు గౌరవప్రదమైన ఉన్నత స్థానాల్లో ఉండటం మరో కారణమన్నారు. ఈ అవకాశాన్ని ఒడుపుగా, వినమ్రంగా ఉపయోగించుకోవాలితప్ప అనవసర డాంబికాలకు పోతే చిక్కులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.

మస్క్ లాగా మోదీ కూడా జేడీ వాన్స్‌ను ఎక్కువగా ప్రస్తావించడం, ప్రశంసించడం వంటి చిన్నాచితకా కారణాలు కూడా ట్రంప్ నిర్ణయాల్ని ప్రభావితం చేసే పరిస్థితుల్లో ఆచితూచి వ్యవహరించాలి. లాబీయింగ్ గట్టిగా చేయాలి. అమెరికా లోని ఎన్నారై ప్రముఖులు కూడా భారం అంతా మోదీ మీద వేయటం, జెండాలు, భారత్‌కి అనుకూల నినాదాలు చేయడంతో ఆగకుండా – ఉభయతారకంగా భారత్ అభివృద్ధికి బలాన్నిచ్చే వాణిజ్య ఒప్పందం కుదిర్చేం దుకు ప్రయత్నించాలి. ప్రస్తుతం ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆదేశాల వల్ల ఎన్నారైలు కొంత ఆత్మరక్షణలో పడ్డమాట వాస్తవంగానీ పరిస్థితి ఎల్లకాలం ఒకేలా ఉండదు.

అసాధ్యమైన అద్భుతం సుసాధ్యమైన మంచికి శత్రువు కాకూడదు అనే రీతిలో ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటూనే, స్వదేశంలో సమ్మిళిత ఆర్థికావృద్ధి, సమ్మిళిత రాజకీయానికి వేగంగా మోదీ సంస్కరణల్ని తేవాలి. విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం పెద్ద తప్పు లు చేశారు అనలేంగానీ– వ్యక్తిగత స్థాయిలో కాకుండా భారత్ స్థాయిలో మనకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా, స్వదేశంలో సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి అవసరమైన సంస్క రణల్ని తేలేదు. సమ్మిళిత అభివృద్ధికి అవసరమైనట్టు అన్ని కనీస వసతుల్లో భారత్ ఎన్నదగిన దేశాల్లో అట్టడుగు స్థాయిలో ఉంది. ఎఫ్‌డీఆర్ అధ్యయనంలో తేలింది. మోదీ ప్రభుత్వంలోనూ అదేలా కొనసాగుతోంది. వ్యవసాయంలో సంస్కరణ చట్టాల్ని మోదీ తెచ్చారుగానీ – ప్రజాస్వామిక చర్చతో ఒప్పించే ప్రయత్నం చేయకుండా వాటిని వెనక్కి తీసుకోవటంతో పాటు, ఇంకా చేయాల్సిన ఇతర సంస్క రణల్ని కూడా పక్కనపెట్టారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో చిన్న పట్టణాలను, గ్రామాల మధ్య అభివృద్ధి చేయటం, పాఠశాల విద్యను ప్రతి బిడ్డకూ ప్రపంచ ప్రమా ణాలతో అందించటం, వినూత్న ఆలోచనల సామాన్యులు కూడా క్రియాశీల భాగస్వాములయ్యేలా రాజకీయ పార్టీల్ని,

**చైనాలా నిశ్శబ్దంగా ఆర్థిక దిగ్గజంగా ఎదిగి ప్రపంచాన్ని ఆకట్టుకోవాలి. రేపటి టెక్నాలజీని ఉపయోగించి ఈవేళ యుద్ధం చేస్తేనే గెలవగలం అని సీడీఎస్ అన్న మాటల్ని భారత రాజకీయ నేతలు వంటబట్టించుకోవాలి. రేపటి స్థాయి సంస్కరణల్ని ఈవేళ తెచ్చేలా వ్యవహరించాలి తప్ప – విధిలేని పరిస్థితుల్లో మార్పు తేవటం లేదా మార్పు దానంతటదే వస్తుందిలే, ఈలోగా ఏదోకరకంగా ఎన్నికల్లో గెలవటం మీదే దృష్టి పెడదాం అనుకోవటంవల్ల భారత్ తన పూర్తిస్థాయి సామర్థ్యానికనుగుణంగా ఎదగలేదు. చైనా ప్లస్‌ని సాధించలేదు.**

ఎన్నికల వ్యవస్థని ప్రజాస్వామీకరించటం వంటి సంస్క రణల్ని తెస్తే ఎటువంటి ఆర్భాటపు ప్రచారం అక్కర్లేకుండానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందుతుంది. చైనాలా నిశ్శబ్దంగా ఆర్థిక దిగ్గజంగా ఎదిగి ప్రపంచాన్ని ఆకట్టుకోవాలి. రేపటి టెక్నాలజీని ఉపయోగించి ఈవేళ యుద్ధం చేస్తేనే గెలవగలం అని సీడీఎస్ అన్న మాటల్ని భారత రాజకీయ నేతలు వంటబట్టించుకోవాలి. రేపటి స్థాయి సంస్కరణల్ని ఈవేళ తెచ్చేలా వ్యవహరించాలి తప్ప – విధిలేని పరిస్థితుల్లో మార్పు తేవటం లేదా మార్పు దానంతటదే వస్తుందిలే, ఈలోగా ఏదోకరకంగా ఎన్నికల్లో గెలవటం మీదే దృష్టి పెడదాం అనుకోవటంవల్ల భారత్ తన పూర్తిస్థాయి సామర్థ్యానికనుగుణంగా ఎదగలేదు. చైనా ప్లస్‌ని సాధించలేదు.

**వినిమయ వృద్ధికి నిర్వచనం మార్చాలి ..**
**పర్యావరణహితం చేయాలి**

మన పౌరులు కూడా ఇతర దేశాల సాంకేతికతల్ని అనుకరించటానికి, ప్రతిదానికీ జుగాడిజానికి పరిమితం కాకుండా సొంత ఆలోచనలు, పరిశోధనలు, ఆవిష్కరణల మీద దృష్టి సారించాలి. అమెరికన్ మార్కెట్ వినియోగ సంస్కృతి, వ్యయాల మీద ఆధారపడే ప్రపంచ మార్కెట్‌లో అమెరికా వాటా 15%. భారత్‌కి ఎక్కువ వాణిజ్య మిగులు వున్నా, ఎక్కువ ఎఫ్‌డీఐల మీద ఆధారపడుతున్నాం. ట్రంప్ సుంకాల బెదిరింపులకు దిగుతున్నారు. మనం స్వదేశీ విని యోగాన్ని పెంచటంతో పాటు, వినిమయ సంస్కృతి స్వభా వాన్ని కూడా మార్చాలి. కొత్త నిర్వచనంతో పర్యావరణహిత వినియోగం ద్వారా వృద్ధిని చూపించాలి. చైనాలా మనతో మార్కెట్ బంధం అమెరికాకు, అనివార్యమయ్యే పరిస్థితిని తేవాలి. వ్యక్తిగతంగా, డబ్బు సంపాదించటమే ఘనత అను కోకుండా, సమాజానికి ఉపయోగపడే పనులు, పెట్టుబడుల ద్వారా ప్రజలు సంపద సృష్టి చేస్తుంటేనే ఇది సాధ్యమవుతుంది. ★

# రామ్మోహనరావుకి జీవిత సాఫల్య పురస్కారం



గజ్వేల్ ప్రెస్ క్లబ్ రజితోత్సవాలను పురస్కరించుకొని సెప్టెంబర్ 7న ప్రజ్ఞాపూర్‌లో జరిగిన సభలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన తొలి జర్నలిస్టు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావును జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య,రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ ఒంటేరు యాదవ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కాజా విరాహత్ అలీ, జిల్లా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్ష , కార్యదర్శులు రంగాచారి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అర్జీల పరిష్కార తీరు పునఃపరిశీలనకు ప్రత్యేక యంత్రాంగం

ప్రజల నుండి అధికారులకు అందే విజ్ఞప్తుల పరిశీలన, పరిష్కారం, తిరస్కృతి తీరును సమీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాల్లో ప్రత్యేక యంత్రాంగం రాబోతోంది. ప్రతి జిల్లా కేంద్రంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు లేదా ముగ్గురు విశ్రాంత తహసీల్దారు లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తారు. రెవిన్యూ చట్టాలపై అవగాహన ఉన్నవారిని ఒప్పంద విధానంలో నియమించాలని ప్రభుత్వం కలెక్టర్లకు పంపిన ఆదేశాల్లో స్పష్టం చేసింది. వీరి ఎంపికకు మౌఖిక పరీక్షలు కూడా నిర్వహించాలని తెలిపింది. రెవిన్యూ అధికారులు తిరస్కరించిన ప్రతి అర్జీని వీరితో పున:పరిశీలింప జేయాలని, పరిష్కరించిన వాటినికూడా ర్యాండమ్ విధానంలో పరిశీలన చేయాలని పేర్కొంది. ఐవీఆర్ఎస్, ఇతర పద్ధతుల్లో ప్రభుత్వం సేకరించే అభిప్రాయాల సరళిని కూడా వీరు పరిశీలిస్తారు. మరోవైపు కొందరు ఒకే సమస్యపై రకరకాల రూపాల్లో ప్రభుత్వానికి దరఖాస్తులు పంపుతున్నారు. దీనివల్ల అర్జీల సంఖ్య పెరిగిపోతోంది ఇకపై దరఖాస్తు స్వీకరణ సమయంలో సదరు వ్యక్తి ఆధార్ నెంబరు నమోదు చేయనున్నారు. దీన్ని ట్రాకింగ్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు స్వర్ణాంధ్ర - 2047 అమల్లో భాగంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు, 26 జిల్లా కేంద్రాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి కంప్యూటర్లు ప్రింటర్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తారు. నియోజకవర్గ యూనిట్‌కు చైర్మన్‌గా ఎమ్మెల్యే, కార్యనిర్వాహక వైస్ చైర్మన్‌గా ప్రత్యేక అధికారి ఉంటారు. జిల్లా స్థాయిలో చైర్మన్‌గా ఇంఛార్జి మంత్రి, కార్య నిర్వాహక వైస్ చైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు.

# ఆధునిక వైద్యం.. అందకుండా చేస్తున్న మూఢనమ్మకం

-బండారు రామ్మోహనరావు



ఆధునిక వైద్యం అందక గిరిజనులు అల్లాడి పోతున్నారు. వేల సంఖ్యలో మాతా శిశు మరణాలు జరుగుతున్నాయి. అనేక వింత రోగాలు రొప్పులతో గిరిజనులు విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. దీనికి కారణం వారి పల్లెలు, తండాలు ఆవాసాలకు సరైన రోడ్డు , రవాణా సౌకర్యం లేకపోవడం ఒక కారణం అయితే, మూఢనమ్మకాలను పాటిస్తూ ఆధునిక వైద్యాన్ని తిరస్కరిస్తూ తమకు తాము మిగతా సమాజంతో దూరంగా ఉంటూ ఒకరకంగా "ఐసోలేట్" అవుతూ కరోనాకాలంలో సామాజిక, భౌతిక దూరాలను పాటించినట్లుగా ఆధునిక వైద్యానికి దూరంగా ఉంటున్నారనేది కూడా ఒక వాస్తవం.

2025 జూలైలో ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఉమ్మడి మెదక్, నల్గొండ, వరంగల్, కరీంనగర్‌లోని అనేక గిరిజన గ్రామాలు గిరిజన జనాభా అధికంగా ఉన్న అదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల ఆరోగ్య సర్వే నిర్వహించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఈ ఆరోగ్య సర్వేలో భాగంగా FDR నుంచి నాతోపాటు సుమేధ, లిఖిత, ఉదయ్ కూడా ఉన్నారు. ముఖ్యంగా అదిలాబాద్ జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మేము సర్వే కోసం తిరిగిన సందర్భంగా కొన్ని నిజాలు వెలుగు చూశాయి. చాలా గిరిజన గ్రామాల ప్రజలు ఆధునిక వైద్యం తమ దరిదాపుల్లోకి రాకుండా ముఖ్యంగా ప్రసూతి విషయంలో ఆసుపత్రి డెలివరీలను వారు తిరస్కరిస్తున్నారు. తమ గ్రామంలోని మంత్రసానే చెయ్యాలనే మంకు పట్టు పడుతున్నారు. అందుకని చాలామందికి గ్రామాల్లో తండాలలో ఆధునిక వైద్యం అందుకోవాలని ఉన్నా కూడా ఆ గ్రామాలలో ఉన్న గిరిజన కుటుంబాల పెద్దల కట్టుబాటు తమ చేతులకు సంకెళ్లు వేస్తున్నాయని కొందరు గిరిజనులతో పాటు అక్కడ ఆరోగ్య సిబ్బంది కూడా మాతో తమ ఆవేదనను పంచుకున్నారు. ఒకవేళ ఆ కుటుంబానికి ఆసుపత్రిలో ప్రసవం ఇష్టమైనా కూడా ఈ కట్టుబాటు వల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు పోలేకపోతున్నారు. ఒకవేళ ఆ కట్టుబాటును ఛేదించి ప్రభుత్వాసుపత్రులకు వారు పోతే ఆ గూడెం నుంచి తండా నుంచి వారిని వారి కుటుంబాలను బహిష్కరించిన సందర్భాలు కూడా ఉన్నాయని వారు తెలిపారు. మంచిర్యాల నుండి అసిఫాబాద్ వెళ్లే మార్గంలో రెబ్బెన అనే ఒక గ్రామం ఉంది. అక్కడ దాదాపు 40 సంవత్సరాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. అక్కడ గిరిజనులు వైద్యాన్ని బాగా ఆదరిస్తున్నారు. ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. కొన్ని గ్రామాలలో ఇటీవల బాగా పెరుగుతున్న షుగర్ వ్యాధి గురించి కానీ సమగ్ర రక్త పరీక్షల నిమిత్తం కానీ వారు ఆసుపత్రులకు రావడానికి నిరాకరిస్తున్నారు. శరీరానికి సూది గుచ్చుకోవడం అది దేవతల పట్ల అపరాధం చేసినట్లు అనే ఒక మూఢనమ్మకం వల్ల వారు ఆకు పసరుల వైద్యంతోనే కాలం వెళ్లబోస్తూ ఆధునిక వైద్యానికి తమను తాము దూరం పెట్టుకుం టున్నారు. కరోనా సమయంలో ఇది మరింత బహి ర్గతమైంది. కరోనా సమయంలో చాలా గిరిజన గూడాలలో ఆరోగ్య సిబ్బంది ఎన్ని ప్రయత్నాలు చేసినా కూడా రక్త పరీక్షలు చేయ నివ్వలేదు. ఆరోగ్య సిబ్బందిని అడ్డుకున్నారు.

అలాగే అదిలాబాదు జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న రెండు మూడు సబ్ సెంటర్లు సందర్శించినప్పుడు ఇలా మూఢ నమ్మకాలతో గిరిజనులు ఆధునిక వైద్యాన్ని తిరస్కరిస్తున్నట్లు మాకు తెలిసింది.

నేషనల్ హైవే 44 మీదుగా అదిలాబాదు వెళ్లే మార్గంలో ఉన్న ఇచ్చోడ, గుడిహత్నూర్ లాంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా మేము సందర్శించినప్పుడు గిరిజనులు ఆసుపత్రికి రావడం ఎక్కువగా కనిపించింది. కానీ అదిలాబాదు నుండి ఉత్తరానికి మహారాష్ట్ర వైపు ఉన్న గ్రామాలు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రాథమిక కేంద్రాలలో డాక్టర్లు ఎంత నచ్చచెప్పిన ఆరోగ్య సిబ్బంది గ్రామాలకు వెళ్లినా కూడా ఆశా వర్కర్లు ఇంటి ఇల్లు తిరిగినా వారి మూఢనమ్మకాలతో ఆధునిక వైద్యాన్ని వ్యతిరేకిస్తున్నారు. అక్కడ అనేక స్వచ్ఛంద సంస్థలు గిరిజనులకు ఇలాంటి మూఢనమ్మకాలను దూరం చేసే ప్రదర్శనలు ఇస్తున్న సందర్భంగా ఇప్పుడు కొంత ఆ మూఢ నమ్మకాలను

తొలగించినట్లు నాకు తెలిసిన స్వచ్ఛంద సంస్థల మిత్రులు చెప్పారు. కానీ ఇంకా మూఢనమ్మకాలు ఒకవైపు రాజ్యమేలుతుంటే, మరొకవైపు మౌలిక సౌకర్యాలు కొరత ముఖ్యంగా రోడ్ల అనుసంధానం సరిగ్గా లేకపోవడం మాకు కొట్టొచ్చినట్లు కనపడింది. మేము అడవుల్లో తిరుగుతూ కొన్నిచోట్ల రోడ్డు మొత్తం కొట్టుకుపోయిన సంద ర్భాలు చూశాం. మాకు గూగుల్ మ్యాప్ చూపించినట్లు రోడ్డు మీద అక్కడిదాకా వెళ్లి అక్కడ రోడ్డు మాయమ వడంతో వెనక్కి వచ్చి చుట్టూ తిరిగి మళ్ళీ 50 కిలోమీటర్లు ప్రయాణం చేసి అనుకున్న గమ్యానికి చేరగలిగినాము.

కొన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో సౌకర్యాల కల్పన బ్రహ్మాం డంగా ఉన్నా కూడా వాటిని ఉపయోగించుకునే విషయంలో గిరిజనుల మూఢనమ్మకాల వల్ల వారికి సేవలు అందిం చడం వైద్య సిబ్బందికి సవాలుగా మారుతుంది.కరోనా కష్టకాలంలో ఆరోగ్య సిబ్బంది ప్రాణాలకు తెగించి గ్రామాలకు వెళ్లి రక్త పరీక్షలు చేసిన సందర్భాలు, అలాగే రహస్యంగా వెనుక దారి నుండి వెళ్లి ప్రసూతులు చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయితే, కొన్ని చోట్ల మా ఊరికి మీరు రావద్దు అని చెప్పి తమ మీద దాడి చేసిన సంఘటనలు కూడా ఉన్నాయని ఆరోగ్య సిబ్బంది మాకు తెలిపారు. ఏదేమైనా ప్రజల్లో చైతన్య కల్పించడం ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థల సామాజిక బాధ్యత . అలాగే రాజకీయ నాయకులు ఓట్ల కోసం గ్రామాలకు వెళ్ళినప్పుడు కూడా ఓటు చైతన్యంతో పాటు ఆరోగ్య చైతన్యం కూడా తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అక్కడి స్థానిక ప్రజాప్రతినిధులు చెబితే సమాజం వింటుంది కనుక సమాజహితం కోరే స్థానిక వార్డు మెంబర్ మొదలుకొని ఎమ్మెల్యే వరకు అవగాహన శిబిరాలు నెలకొల్పి ఆధునిక వైద్యాన్ని మరింత దగ్గర చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అలాగే అదిలాబాదు పక్కనే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న "అంకోలా" అనే గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఏకంగా 17 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఆ ఆరోగ్య కేంద్రం నుండి చివరి గ్రామం సుమారు 50 నుంచి 60 కిలోమీటర్ల వరకు ఉంటుంది. బహుశా ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఎక్కువ హెల్త్ సబ్ సెంటర్లు ఉన్న ఆరోగ్య కేంద్రంగా చెప్పవచ్చు. అక్కడ ఆధునిక వైద్యానికి ప్రజలు మొగ్గు చూపుతున్నా డిమాండ్ ఉన్నా కూడా దూరప్రాంత గ్రామీణులు కనీసం 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సి వస్తుంది. కనుక అలాంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విభజించి రెండు మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని చోట్ల డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది.

2018, 2023లో అప్పటి ప్రభుత్వం రెండుసార్లు డాక్టర్ల నియామకం చేయడం వల్ల మాత్రమే ఈ రోజు గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇద్దరు ముగ్గురు డాక్టర్లు ఉండాల్సిన చోట కనీసం ఒక్క డాక్టర్ అయినా పని చేస్తున్నారు. మా సర్వే టీం డాక్టర్లు వైద్య సిబ్బంది నియా మకం ఎప్పుడు జరిగిందని వారి సర్వీస్ వివరాలు అడిగినప్పుడు ఈ విషయం తెలిసింది. మేము 2018లో 2023 నియామకం అయ్యామని చాలామంది డాక్టర్లు చెప్పారు. అలాగే ఆరోగ్య సిబ్బంది నర్సులు పారా మెడికల్ సిబ్బంది కూడా ఆ సమయంలోనే ఎక్కువమంది నియా మకం అయ్యారని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఏమైనా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు పని భారం ఎక్కువ ఉన్నా కూడా గిరిజన పల్లెలలో మూఢనమ్మకాలను ఛేదిస్తూ ముందుకు వెళుతున్న సందర్భాన్ని గుర్తు చేసుకుంటే ఇవాళ చీకటి ..రేపటి సూర్యోదయానికి దారితీస్తుందనిపించింది.

అంతిమంగా గిరిజన పల్లెల్లో పనిచేస్తున్న డాక్టర్లు, నర్సులు ఇతర వైద్య సిబ్బందితోపాటు ఆశావర్కర్లు, ఆయాల సేవలు ప్రశంసనీయంగా ఉన్నాయి. ప్రజలు తమ మూఢ నమ్మకాలను విడిచిపెట్టి ఆధునిక వైద్యాన్ని ఉపయోగిం చుకోవాలి..వారికి మరిన్ని ఆధునిక సౌకర్యాలు మరింత అందుబాటులోకి రావాలని మా ఆరోగ్య సర్వే సారాంశం. ★

## ప్రతి నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయండి: లోక్‌సత్తా

ఉత్తరాంధ్రలో, ముఖ్యంగా విజయనగరం జిల్లాలో ఉపాధి అవకాశాలు లేక యువత తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఉపాధి కల్పించేందుకు నియోజకవర్గానికో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోక్ సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందుకోసం వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లాలో చేపట్టగలిగిన చర్యలపై కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కి వినతి పత్రం అందించారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని, కొత్త పరిశ్రమలు రాలేదని, వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. చిన్న పట్టణాలను గ్రామాల మధ్య ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైతే డ్రైవర్లు, పెయింటర్లు, శానిటరీ, ప్లంబింగ్, గార్డెనింగ్ తదితర విభాగాల్లో వేలాదిమంది నైపుణ్యమున్న యువతీయువకులకు అన్ని సౌకర్యాలతో ఉపాధి లభిస్తుందన్నారు. యూనియన్ పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి ఇక్కడి సమస్యల పట్ల అవగాహన ఉండటం కలసివచ్చే అంశమన్నారు. రేపటి అభివృద్ధికి తగ్గ కృషిని యువత ఇప్పటి నుంచే చేస్తే అనవసర వలసల్ని ఆపవచ్చన్నారు.

# విద్యతోనే భారత్ సమ్మిళిత అభివృద్ధి

రౌతు ఓడయితే గుర్రం మూడు కాళ్ళతో పరిగెడుతుందని, ఇన్ని కోట్ల యువ జనాభా ఉన్నా నాణ్యమైన విద్య లేకపోబట్టి ట్రంప్ లాంటి వారు ఎన్ని మాటలన్నా పడాల్సి వస్తోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు, పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. డబ్బు ఖర్చు చేస్తూ కూడా ఈ దేశంలోని కోట్లాది మంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించలేక పోతున్నామన్నారు. ప్రభుత్వ స్కూళ్ళలో విద్యార్థులు తగ్గుతూ విచిత్రంగా టీచర్ రిక్రూట్ మెంట్‌లు పెరుగుతున్నాయన్నారు. బెస్ట్ జూనియర్ కాలేజీ, సుజాతా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బీపి రావు ఆధ్వర్యంలో విజయ నగరంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో బాబ్జీ పాల్గొన్నారు. స్కూలు విద్య పునాదులు సక్రమంగా ఉంటేనే ఉన్నత విద్య భవనం సరిగ్గా ఉంటుందన్నారు. భవిష్యత్తులో 90% కి పైగా యువతదేనని, రియల్ హీరోలను వదిలేసి రీల్ హీరోల చుట్టూ సమయం వృథా చేసుకోవద్దన్నారు. 'మీ లైఫ్ లో మీరే హీరోలు. చదువంటే మార్కులే కాదు.. సమస్యల్ని తెలివిగా, తక్కువ వనరులతో ఇస్రోలా పరిష్కరించటం. మీ అభివృద్ధిని – సమాజ హితాన్ని బ్యాలన్స్ గావించుకోవటం. భారత్ 2047కి అమెరికా, చైనాకు దీటుగా ఎదగటం మీ చదువుల క్వాలిటీ మీద ఆధారపడి ఉంది' అని బాబ్జీ అన్నారు. చదువులో సక్సెస్‌కి నిర్వచనం ఆ రకంగా మార్చుకుని.. నాలెడ్జ్ మీద దృష్టి సారించి సమస్యల పరిష్కారంలో భాగమైతే వేల డాలర్లు ఖర్చు పెట్టి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు, ట్రంప్ లాంటి వారి నుండి సమస్యలు ఎదుర్కోనక్కర్లేదు, ప్రభుత్వోద్యోగాల కోసం సమయం వృథా గావించుకోనక్కర్లేదు ' అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, మరో అతిథి మంగవేణి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటు ప్రాధాన్యతపై అవగాహన సదస్సు

ఓటు అమ్ముకుంటే నష్టపోతామని, ఓటు విలువ తెలుసుకుని సక్రమంగా వినియోగిస్తే సమాజానికి మేలు జరుగుతుందని సమాచార హక్కు రక్షణ చట్టం సభ్యులు పేర్కొన్నారు. ఓటు ప్రాధాన్యతపై మక్తల్ అంబేద్కర్ కళా భవనంలో సమాచార హక్కు రక్షణ చట్టం సభ్యులు ఓటు ప్రాధాన్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం సభ్యులు నారాయణ , రాష్ట్ర మహిళా కన్వీనర్ హజమ్మా , బాలరాజు. జిల్లా ఉపాధ్యక్షులు శివ శంకర్, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, నరసింగప్ప నారాయణ , అంబేద్కర్ సంఘం అధ్యక్షులు శంకర్, గోపాల, ఉప సర్పంచ్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



## రోజుకో అవినీతి కేసు..

లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అన్ని ప్రభుత్వ శాఖలను అవినీతి పట్టిపీడుస్తోంది. భారీగా లంచాలు తీసుకుంటూ ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడ బెడు తున్నారు. నీటిపారుదలశాఖలో కొందరు ఉన్నతాధికారుల అవినీతి సొమ్ముతో కోట్లకు పడగలెత్తడం ఇటీవలే బట్టబయలైంది.

గత నెలలో సగటున రోజుకు ఒక అవినీతి కేసు నమోదైంది. ఆగస్టు 1 నుంచి 31 వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 31 కేసులు నమోదు చేసినట్టు తెలంగాణ ఏసీబీ తెలిపింది. ఇందులో15 ట్రాప్‌కేసులు, రెండు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, మూడు క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు, ఏడు రెగ్యులర్ ఎంక్వైరీలు, నాలుగు సర్‌ప్రైజ్ చెక్‌లు ఉన్నట్టు తెలిపింది. గత నెలలో నలుగురు ప్రైవేటు వ్యక్తులు సహా మొత్తం 22 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఏసీబీ ట్రాప్ కేసులలో నిందితుల వద్ద నుంచి రూ.2,82,500, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులలో రూ.5,13,75,198 జప్తు చేసినట్టు వెల్లడించారు. ఆగస్టులో 25 కేసులలో ఏసీబీ అధికారులు తుది చార్జిషీట్ నమోదు చేసిట్టు తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో రూ.44.30 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసినట్టు వెల్లడించారు.




# విద్యా విజన్ 2025




మన పాఠశాల విద్యలో పరీక్షలు పెడుతూ, సర్వేలు చేస్తూ, ఎంట్రెన్స్ టెస్ట్ లు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు.. క్లాసు పరీక్షలో 99% మంది పాస్, ర్యాంకులూ సంపాదిస్తుంటే.. వారిలో ఆ తరగతి స్థాయి నిజమైన పరిజ్ఞానం మాత్రం 15 – 20% మందికే ఎందుకు ఉంటోంది? వాళ్లు మళ్లీ పోటీ పరీక్షల్లో ఎందుకు నెగ్గలేకపోతున్నారు? అన్న కామన్ సెన్స్‌ని కూడా ప్రదర్శించ లేకపోతున్నాయని ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక్కో పాఠశాల విద్యార్థి మీదా ఏడాదికి 1 లక్షా 8 వేలు ఖర్చు పెడుతున్నట్లు విద్యామంత్రి కూడా అయిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారన్నారు. ఇది చాలా ప్రయివేటు స్కూళ్ల ఫీజు కంటే చాలా ఎక్కువని అన్నారు. ఈ సంక్షోభానికి తేలికైన పరిష్కారాలున్నాయన్నారు. రాజకీయ సంకల్పం, వనరుల కేటాయింపు, వినియోగం.. సవ్యంగా, ఫలితాలు వచ్చేలా జరగాలన్నారు. పరీక్షల పద్ధతిలో ఎలాంటి మార్పు తెస్తే మొత్తం విద్యా వ్యవస్థ మారుతుందో ప్రభుత్వాలు పట్టించుకోవాలన్నారు. 10 టీవీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో జరిగిన ఎడ్యు విజన్ 2025 కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణలో జేపీ పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ, సినీ నటుడు మురళీ మోహన్, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, వివిధ పాఠశాలలు, కళాశాలలు, శిక్షణా సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th September, 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




30 రోజుల జైలుతో PM, CMలకు పదవీగండం బిల్లులపై
ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
ఏం చెబుతున్నారు..




*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**